# మంచు మనిషి

## రమణశ్రీ

ఫోన్ బెల్ గణగణమంటూ మ్రోగింది.

ఎలక్ట్రిక్ రేజర్‌తో షేవ్ చేసుకుంటున్న బ్రిగేడియర్ జైల్ సింగ్ ఎడంచేతితో రిసీవరు అందుకున్నాడు.

"గుడ్ మార్నింగ్ బ్రిగేడియర్ సాబ్!" స్నో స్మైల్ హోటల్ రిసెప్షనిస్ట్ కంఠం మృదుమధురంగా విన్పించింది.

"గుడ్ మార్నింగ్ బేబీ. ఏమిటి విశేషాలు?" అడిగాడు జైల్ సింగ్.

"మీకోసం మిష్టర్ జయాల్ వచ్చారు. పైకి పంపించమంటారా?"

"సారీ బేబీ, చిన్నపనిలో వున్నాను. రెండునిమిషాలు అతనికి కమ్మని కబుర్లు చెప్పి, ఆ తరువాత పైకి

పంపించు" అంటూ రిసీవర్ క్రెడిల్ చేసి బాత్ రూంలోకి పరిగెత్తాడు సింగ్.

హాట్ వాటర్ షవర్ తిప్పి సోప్ అందుకున్నాడు సింగ్.

అయిదునిమిషాలు గడిచాయి.

బాత్ రూం తలుపు తెరచుకొని బయటకు రాగానే, ఎదురుగా సోఫాలో కూర్చొనివున్న జయాల్ కన్పించాడు.

"గుడ్ మార్నింగ్ సింగ్ జీ" సోఫాలోంచి లేచి విష్ చేశాడు జయాల్.

"గుడ్ మార్నింగ్ మిస్టర్ జయాల్, సారీ ఫర్ ది లేట్ అండ్ ట్రబుల్" జయాల్ కు ఎదురుగా కూర్చుని సిగరెట్ అంటిస్తూ అన్నాడు సింగ్.

"నెవర్ మైండ్ సర్! మరో అరగంటలో సమావేశం ప్రారంభమవుతుంది. మిమ్మల్ని స్వయంగా తీసుకురమ్మని సిన్హాగారు పంపించారు."

"థాంక్స్. టిఫిన్ చేసి బయల్దేరుదాం" రూంసర్వీస్ కోసం కాలింగ్ బెల్ ప్రెస్ చేస్తూ అన్నాడు.

ఉదయం ఎనిమిది గంటలయింది. ఇంకా సూర్యుడు స్పష్టంగా కన్పించడంలేదు. బయట సన్నగా మంచు తుంపరలు పడుతున్నాయి.

"సింగ్ జీ, మీ రూంలో ఫైర్ ప్లేస్ లేదా?" అడిగాడు జయాల్.

"ఎక్కడో వుండేవుంటుంది. దాని అవసరం నాకు రాలేదు."

ఆశ్చర్యపోయాడు జయాల్. "వాట్ సింగ్ జీ, ఈ డార్జిలింగ్ లో ఫైర్ ప్లేస్ చెంతలేకుండా మీరు యీ రాత్రి అంతా గడిపారా?" అడిగాడు.

"ఎస్ మిస్టర్ జయాల్, నేను బ్రిగేడియర్‌ను. అహర్నిశలూ సరిహద్దుల దగ్గర అప్రమత్తతతో వుండే మేము, ఫైర్ ప్లేస్‌లకు అలవాటుపడితే కష్టం. ఆ చలి మా శరీరాలకు దడిచి పారిపోవలసిందే!" నవ్వాడు జైల్ సింగ్.

రూంసర్వీస్ బోయ్ వచ్చి వేడివేడి టిఫెన్, విస్కీ టేబుల్స్‌పైన సర్ది వెళ్ళిపోయాడు.

పదినిమిషాలలో టిఫెన్ పూర్తిచేసి బయటపడ్డారిద్దరూ.

జయాల్ టాక్సీపిలిచి, ఎక్కడికి వెళ్ళాలో చెప్పాడు.

మరుక్షణం టాక్సీ ఇండియన్ మౌంటనీరింగ్ ఇన్‌స్టిట్యూట్ వైపు దారితీసింది.

*　　　　*　　　　*

జైల్‌సింగ్ హిమాలయాలవద్ద చైనా సరిహద్దులలో భారత సైన్యంలో బ్రిగేడియర్‌గా పనిచేస్తున్నాడు.

1962 లో చైనాతో యుద్ధం సంభవించినప్పుడు, ఏమాత్రం అనుభవం లేకుండానే, హిమాలయాలపై సంచరించుతూ, సరిహద్దులను కాపాడవలసి వచ్చింది భారత సైన్యం. అప్పుడే అతనిలో గల పర్వతారోహణ మీది వుత్సాహం రెట్టింపు అయింది.

యుద్ధం ముగిసింది. మంచుపర్వతాలలో సంచరించే సుశిక్షితులైన సిబ్బందిలేనిలోటు భారత ప్రభుత్వానికి ఆ యుద్ధంలో స్పష్టంగా కన్పించింది.

వెంటనే ప్రభుత్వం కార్యాచరణకు పూనుకుంది.

అప్పటికే డార్జిలింగ్‌లో పేరుకు పనిచేస్తున్న ఇండియన్ మౌంటనీరింగ్ ఇన్‌స్టిట్యూట్‌ను బాగా అభివృద్ధి పరిచి, ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన డాక్టర్ సిన్హాను ఆ ఇన్‌స్టిట్యూట్‌కు ప్రిన్సిపాల్‌గా నియమించింది.

ఆ తరువాత ముఖ్యమైన సైనిక సిబ్బందిని శిక్షణకై ఆ ఇన్‌స్టిట్యూట్‌కు తరలించింది.

అలా ఆ ఇన్‌స్టిట్యూట్‌కు వచ్చిన మొదటిజట్టులో ఒకడు బ్రిగేడియర్ జైల్‌సింగ్.

సహజంగా పర్వతారోహణయందు వుత్సాహంగల జైల్‌సింగ్ వచ్చిన అవకాశాన్ని చక్కగా సద్వినియోగం చేసుకున్నాడు.

ప్రిన్సిపాల్ సిన్హాగారి ప్రత్యేక అభిమానానికి పాత్రుడయ్యాడు.

ప్రతిసంవత్సరం ఇన్‌స్టిట్యూట్ వార్షికోత్సవాలకు పిలుపు వస్తూనే వుంటుంది. ఎన్నిపనులున్నా, సింగ్ ఆ వుత్సవాలకు హాజరవుతూనే వుంటాడు.

అలాగే యీ సంవత్సరం వార్షికోత్సవాలకు గూడా, తప్పకుండా రమ్మని, యీ వార్షికోత్సవానికి యిటీవల ఎవరెస్ట్ నధిరోహించిన ప్రొఫెసర్ దయాళ్ బృందం ముఖ్య అతిధులుగా వస్తున్నారని, వారి పర్వతారోహణ విశేషాలు తెలుసుకోవచ్చునని వుత్తరం వ్రాసారు సిన్హాగారు.

ఎంతోవుత్సాహంతో, తాను యీ వుత్సవానికి హాజరవుతున్నట్లు ప్రిన్సిపాల్ సిన్హాగారికి టెలిగ్రామ్ యిచ్చి, డార్జిలింగ్‌కు ప్రయాణమయ్యాడు జైల్‌సింగ్.

డార్జిలింగ్‌కి వచ్చేటప్పటికి అతనికోసం స్నోస్క్రైల్ హోటల్‌లో రూం బుక్ చేసి వుంచారు సిన్హాగారు.

## 2

ప్రొఫెసర్ దయాళ్ చిన్నగా గొంతు సవరించుకొని చెప్పటం ప్రారంభించారు. ఆ హాలులో సమావేశమైన వారంతా ఆయన చెప్పేది శ్రద్ధగా వినసాగారు.

"జంటిల్మెన్ అండ్ లేడీస్!

సరిగ్గా మూడు నెలల క్రితం భారత ప్రభుత్వంనుండి నాకు పిలుపు వచ్చింది.

ఎవరెస్టును అధిరోహించే బృందానికి నన్ను నాయకత్వం వహించమని ఆజ్ఞాపించారు. మొదట్లో నేను ఆశ్చర్యపోయాను. ఎవరెస్ట శిఖరాన్ని అధిరోహించడమంటే మాటలు కాదు. అది మన భారతదేశ గౌరవ ప్రతిష్టలను పణంగా పెట్టిచేసే సాహసకార్యం. ఏ మాత్రం విఫలమైనా, ప్రపంచ దేశాలమధ్య మనకు చిన్నతనంగా వుంటుంది.

ఆలోచించి చెబుతానని మాట యిచ్చాను.

వెంటనే నా గురుతుల్యులు, మిత్రులు సిన్హాగారిని కలుసుకొని సంప్రదించాను. ఆయనగారు ఆనాడు నా కిచ్చిన ప్రోత్సాహంతోనే, నేను ఎవరెస్ట అధిరోహించ గలిగాను.

సిన్హాగారిని సంప్రదించిన వెంటనే, నా అంగీకారాన్ని తెలియ చేశాను ప్రభుత్వానికి. వెంటనే ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి.

పర్వతారోహణకు పూనుకోవడం చాలా కష్టమే గాక, మిక్కిలి వ్యయమైనదన్న విషయం మీకు తెలియనిది కాదు. మా సాహస యాత్ర పూర్తి కావడానికి మొత్తం ఆరులక్షల రూపాయలు ఖర్చయింది.

మా బృందంలో మొత్తం పదకొండు మంది సభ్యులం. ఆ పదకొండుమంది వరుసగా, నేను, మిష్టర్ దేవరాజ్, లాల్ ఖన్నా, కిరణ్ దాస్, జోగిందర్ సింగ్, రామదాసు, ప్రొఫెసర్ మూర్తి, డాక్టర్ హరేరామ్, కర్నెల్ రెడ్డి, శ్రీమతి జుబేదా, కుమారి సంఘమిత్ర.

మొత్తం మా బృందంలో పదకొండుమందిమి గాక,

800 వందలమంది షెర్పా స్త్రీ- పురుషులను ఏర్పాటు చేసుకున్నాం. వారికి రోజుకు అయిదురూపాయలు కూలి. ఒక్కొక్కరు 27 కిలోల బరువును ఎత్తుకున్నారు. మొత్తం మా వస్తువుల బరువు 19 టన్నులు.

మే 6 వ తేదీన అంతా కలిసి బయలుదేరాం.

అయిదు రోజులకు మేమంతా 'ఖుంబు' లో ప్రవేశించాం. అక్కడ 1300 మీటర్ల ఎత్తు వుంటుంది. అక్కడ ఎండ బాగా మండిపోయేది. గాలి కనుక సరిగా వీచకపోతే, ఎండకు మా వొళ్ళు బొబ్బలు పొక్కేది. మేము ఒంటికి ఎన్నో క్రీమ్స్ రాసుకొనే వాళ్ళం. ఎండకు పెదాలు పగిలిపోయేవి. నవ్వుతున్నా, మాట్లాడుతున్నా, పగిలిన పెదాలు మంట పుట్టేవి. ఇక పైకి ఎక్కుతున్న కొలదీ మేము స్పెషల్ స్పెట్స్‌ను తప్పనిసరిగా ధరించేవాళ్ళం. లేకపోతే అల్ట్రావైలెట్ కిరణాలు కళ్ళమీద పడితే గుడ్డితనం వస్తుంది.

పర్వతాలపై గంట కొక వాతావరణం వుండేది. ఓ క్షణంలో మండిపోయే ఎండ, మరుక్షణంలో గజగజలాడించే చలి, మమ్మల్ని నిజంగా ఏడిపించేవి.

అయితే ఎప్పుడూ కూడా మా దగ్గర వాతావర్ణమునకు అనువైన దుస్తులను రెడీగా వుంచుకొనే వాళ్ళం.

మా ప్రయాణంలో ముఖ్యమైన మజిలీ 'త్యాంగ్ బోచ్'. ఇది 3,900 మీటర్ల ఎత్తున వుంది. అక్కడినుండి ఎత్తైన పర్వతాలను చూడగలం.

అక్కడవరకు మా సామానులను చేరవేసిన వారికందరికీ డబ్బులిచ్చి పంపేశాం. వారిలో బలంగా వుండి, కొంచం ఎత్తు ప్రదేశాలు ఎక్కడంలో అనుభవం గల వారిని ఓ 120 మందిని మాతో వుంచుకున్నాం. వీరు ఎవరెస్ట్ పర్వతంమీద ఒక్కొక్క మజిలీకి మా సామా

నును అంచెలంచెలుగా చేరవేసేవారు.

ముందుగా ఎవరెస్ట్ దిగువ దక్షిణ మజిలీని చేరుకున్నాం. అక్కడనుండి మరో నాలుగురోజులు ప్రయాణం చేసి 'ఖుంబు' మంచునదిని దాటి ఎవరెస్ట్‌మీద మొదటి మజిలీని చేరుకున్నాం. అక్కడ కొన్ని రోజులు హాయిగా గడిపాం. ఇక అక్కడినుండే అసలైన ఎవరెస్ట్ శిఖరారోహణ ప్రారంభమవుతుంది.

ముందు ఎవరెస్ట్ శిఖరాన్ని చేరుకోవాలంటే, మంచి దారి కనుక్కోవాలి కదా! అందుకు కొంతమంది దళ సభ్యులు, షెర్పాలు ముందుకు పోయారు.

అక్కడ పెద్ద పెద్ద మంచు కొండలు దొంతరలుగా కన్పిస్తాయి. వాటి వెనుక మంచువాగులు ప్రవహిస్తూ వుంటాయి.

అప్పుడప్పుడు లోయలలో పేరుకుపోయిన మంచు కరిగి క్రిందకు ప్రవహిస్తూ వుంటుంది.

పైనుండి మంచు బండలు క్రిందకు జారుతున్నప్పుడు, చాలా జాగ్రత్తగా వుండాలి. లేకపోతే అవి ప్రాణాపాయం కలిగిస్తాయి. పైనుండి మంచు దిమ్మలు రాకెట్లు దూసుకు వస్తున్నట్లు దూసుకువస్తాయి. అవన్నీ గుట్టలుగా ఓచోట పేరుకుపోతాయి. వాటినే మనం 'లేటరల్ మొరయిన్స్' అంటాం.

మంచు దిబ్బలు క్రిందకు జరిగే సమయంలో, ప్రయాణం చేసే దిక్కుకు అడ్డంగా నెరలు ఏర్పడతాయి. వీటి వెడల్పు 15 మీటర్ల గరిష్ట పరిమితి వరకు వుంటుంది. కొండలను ఎక్కేటప్పుడు నిజంగా యివే పెద్ద అడ్డంకులు. ఒకొక్కసారి నెరలమధ్య పల్చగా మంచు పేరుకుపోయి నెర కనబడదు. కానీ ఇది చాలా ప్రమాదకరమైనది. పొరబాటున మనం కాలు అక్కడ పెట్టామంటే,

నెర లోపలకు దిగిపోయి, మంచులో సమాధి అయిపోతాం.

అక్కడ పర్వతాలను ఎక్కడం చాలాకష్టం. అవి చాలా నిటారుగా వుంటాయి. అంతేకాదు పైనుండి ఎప్పుడు మంచువిరిగి క్రిందకు పడుతూనే వుంటుంది. ఒక్కొక్కసారి ఆకస్మాత్తుగా కొండచరియలు కూలుతూ వుంటాయి. అప్పుడు పెద్దబాంబు ప్రేలినశబ్దం వస్తుంది. ఏమాత్రం అజాగ్రత్తగా వున్నా, ఆ మంచుబండల క్రింద మన అనవాళ్లుకూడా దొరకవు.

గుట్టలుగా పోగయిన మంచుబండలను, మధ్యమధ్య అగాధాలవలె వుండే నెరలను దాటటానికి అల్యూమినియం నిచ్చెనలను, కొయ్యదుంగలను వుపయోగించే వాళ్ళం.

ముందు వెళ్తున్నవాళ్ళుసుంతా దారిపొడుగునా రంగు జండాలను పాతేవాళ్ళం. మా వెనుకవచ్చేవాళ్ళు, ఆ జండాలను గుర్తించి మమ్ములను అనుసరించేవాళ్ళు.

ఓసారి గొప్ప ప్రమాదం సంభవించింది. మా దళం యావత్తూ ప్రాణాలను కోల్పోయేవాళ్ళం. ఒకచోట మంచుకొండల మధ్య ఓ పెద్ద నెర ఏర్పడివుంది. దానిని దాటటానికి అల్యూమినియం నిచ్చెనను ఏర్పాటుచేశాం.

ఇక అంతా ఆ నిచ్చెనమీద మోకుసహాయంతో నెరను దాటసాగాం. అయితే దురదృష్టవశాత్తూ, మంచు బాగా కరిగి ఆ నెర పెద్దదయింది. అంతే బిళ్ళబీటుగా నిచ్చెన మొత్తం అగాధంలో కూలిపోయింది.

అయితే అదృష్టం మా పక్షానవుంది. అప్పటికి సగం మంది నెరదాటారు. మిగిలిన సగంమంది అగాధంలో పడిపోయినా, అంతా కలిపి కట్టుకున్న మోకువలన అగాధంలో పడినవాళ్ళం క్రిందకు జారిపోక అలాగే వ్రేలాడసాగాం. అలా వ్రేలాడిన వారిలో నేనూ

వున్నాను.

ఓ అరగంటకు అతికష్టంమీద మమ్మల్ని పైకిలాగారు.

ఇన్ని కష్టాలు వచ్చినా, మేము బాగానే పురోగమించాం. జూన్ 10 వ తారీకున 5,900 మీటర్ల ఎత్తున మొదటి మజిలీ ఏర్పాటు చేసుకున్నాం.

ఇక ఎవరెస్ట్ శిఖరం ఎక్కడానికి మాకు ఎనిమిది వారాలు మాత్రమే వున్నాయి.

మరో మూడురోజులకు రెండవ మజిలీని చేరుకున్నాం. ఇది 6,000 మీటర్ల ఎత్తునవుంది. పశ్చిమ కూమ్‌నుండి మంచు జారడం యిక్కడే ప్రారంభమవుతుంది. మరో నాలుగు రోజులకు 6,400 మీటర్ల ఎత్తున వున్న ప్రదేశానికి చేరాం.

అక్కడ మాత్రం కొండ ఎక్కడం చాలాకష్టం. మెల్లగా ప్రాకుతూ ఎక్కాలి. అక్కడ ప్రాంతమంతా నిట్టనిలువుగా వుంటుంది. దానికే మనం 'ల్హోట్సాఫేస్' అంటాం.

ల్హోట్సాఫేస్ వద్ద గొడ్డళ్ళతో మంచును నరికి మెట్లుగా తయారుచేసుకొనే వాళ్ళం. పట్టుదొరకడానికి అక్కడక్కడ ఇనప మేకులుకొట్టే వాళ్ళం.

చిట్టచివరకు 8,000 మీటర్ల ఎత్తునవున్న 'సౌత్ కోల్'ను చేరుకొని అక్కడ ఓ స్థిరమైన గుడారం వేసుకున్నాం.

అప్పుడే వాతావరణం బాగా చెడిపోయింది. పెద్ద పెద్ద గాలులతో బాటు, మంచు తుఫాన్ లా కురిసేది. అక్కడ మంచు తుఫానులు తగ్గేవరకు ఓ పదిరోజులు ఖాళీగా కూర్చుండిపోయాం.

వాతావరణం క్రమేపీ మెరుగుపడింది. వైర్‌లెస్ ద్వారా మాకు ఎప్పటికప్పుడు ఢిల్లీనుండి సమాచారం

అందుతూ వుండేది. మా కోసం ప్రత్యేకంగా ఆలిండియా రేడియోవారు రోజుకు అయిదుసార్లు వాతావరణ వివరాలు ప్రకటించేవారు.

జూలై 19 వ తారీకు ఎవరెస్టు ఎక్కడానికి చివరి ప్రయత్నాలు ప్రారంభించాం. అక్కడ మేము ముగ్గురు చొప్పున ఒక దళంగా విడిపోయాం. ప్రారంభ సన్నాహాలు పూర్తి చేసుకొని రెడీగా వున్నాం.

20వ తారీకు వాతావర్ణం బాగుపడింది. మాది మొదటి దళం. మాదళంలో నేనూ, డాక్టర్ హరేరాం, కుమారి సంఘమిత్ర వున్నాం. సౌత్ కోల్ వైపునుండి ఆరోహణ ప్రారంభించాం.

మేం ముగ్గురం కలిసి, ఓ నైలాన్ తాడును కట్టుకున్నాం. మాకు కావలసిన సామానంతా వీపుకు కట్టుకున్నాం. మూడు ఆక్సిజన్ సిలిండర్లు, నిమ్మరసం ఫ్లాస్కు, చేతులకు గ్లోవ్స్, కాళ్ళకు మేజోళ్ళు, నల్లద్దాల కళ్ళజోళ్ళు, స్వెట్స్, కెమెరా, టార్చి వగైరాలు అన్నీ అందుబాటులో అమర్చుకున్నాం. మొత్తం ఒకొక్కళ్ళం 25 కిలోల బరువు మోయవలసి వచ్చింది.

ముగ్గురం బయలుదేరాం. ఆక్సిజన్ సిలిండర్లు మూతికి బిగించుకొన్నందువలన మాకు మాట్లాడుకోవడానికి అవకాశం వుండేదికాదు. చుట్టూ మంచు విపరీతంగా కురుస్తోంది. ఎంతవరకు సైగలతోనే కాలం గడిపేవాళ్ళం.

ఇంకా 210 మీటర్లువుంది శిఖరం. చాలా నిదానంగా ప్రాకుతున్నాం. కొండబాగా ఏటవాలుగా వుంది. అడుగడుగునా జారిపోయేది. ప్రక్కన పెద్దపెద్ద అగాధాలు.

అంతలో హఠాత్తుగా వాతావర్ణంలో మార్పువచ్చింది. గాలి బాగా వీయసాగింది. ఆ గాలికి లేచిన మంచు మూలంగా దారి కనబడటం మానేసింది. ఆ పరిస్థితిలో

శిఖరాన్ని అధిరోహించడం వీలుబడదని అనుకున్నాం.

హారేరామ్ మా ముగ్గురిలో ముందు వున్నాడు. పైన వాతావరణం చాలా దారుణంగా వున్నట్లు సంజ్ఞ చేసి చెప్పాడు హారేరామ్. ముందుకు వెళ్ళడం కష్టమనిగూడా సూచించాడు. ఏంచేద్దామన్నట్లు ప్రశ్నార్థకంగా చూశాడు.

ఓ రెండు నిమిషాలు ఆలోచించాను. అంతవరకు కష్టపడివచ్చి, వెనక్కు తిరగడానికి ప్రాణమొప్పలేదు. ప్రాణత్యాగానికిగూడా సిద్ధపడి పైకి సాగిపొమ్మని ఆజ్ఞాపించాను.

నిజంగా నేను ఆ సమయంలో తీసుకున్న నిర్ణయం చాలా ప్రమాదకరమైనది. శిఖరంపైకి ఎక్కేకొలది వాతావరణంలో విపరీతమైన మార్పులు వస్తాయి. నిజానికి మా ప్రాణాలకన్న గొప్పదికాదు శిఖరారోహణం. కానీ ఆ పరిస్థితి విచిత్రమైనది. మిక్కిలి ఉద్రేకపూరితమైనది. ఒక్క నా ప్రాణమేకాదు నా సహచరులిద్దరి ప్రాణాలు కూడా సర్వతాలవ పణంగా బెట్టి ముందుకు సాగిపొమ్మని ఆజ్ఞ యిచ్చాను.

నా మాటమీద గౌరవంతో డాక్టర్ హరేరామ్, మిస్ సంఘమిత్రగూడా ఏం మాట్లాడలేకపోయారు. ఇక మేమంతా మా ప్రాణాలమీద ఆశవదులుకొని ముందుకు నడిచాం.

దిగువ మజిలీలో వున్నవారు క్రిందకు వచ్చేయమని పదేపదే హెచ్చరించసాగారు. మేం మా దృఢ నిశ్చయాన్ని మరోసారి పునరుద్ఘాటించి పైకి ప్రాకడం మొదలుపెట్టాం.

చివరకు జులై 29వ తేదీన విజయం సాధించాం.

చావుతప్పి కన్ను లొట్టపోయినా, ఎవరెస్ట్ శిఖరం మీద కాలుమోపాం. ఆ దిగ్విజయ వార్తను దిగువ మజిలీ

తోని మిత్రులకు, సిన్హా గారికి, భారత ప్రభుత్వానికి వుత్సాహంగా వైర్ లెస్ ద్వారా తెలియచేశాం.

నిజంగా ఆ శిఖరాన్ని అధిరోహించిన ఆ క్షణం ఎంతటి మహత్తరమైన అనుభూతిని కల్గించిందో నేను మాటలలో చెప్పలేను. మా శరీరాలన్నీ వుద్వేగంతో ఒక్కసారిగా కంపించాయి.

అక్కడ భారతదేశపు పతాకాన్ని ఎగురవేసి బిగ్గరగా 'జై భారత్' అని అరిచాం. మాలో మేం ఒకరినొకరు కౌగలించుకొని ముద్దులు పెట్టుకున్నాం. శిఖరంమీదనే ఒకరోజు పూర్తిగా రెస్ట్ తీసుకున్నాం. కెమరాలో రీల్స్ అయిపోయేంతవరకు స్నాప్స్ తీసుకున్నాం. మా గుర్తుగా అక్కడ కొన్ని వస్తువులను భద్రపరిచాం.

మరుసటిరోజు స్వీట్స్ తిని, నిమ్మరసం తీసుకొని బయలుదేరాం. మాకు క్రిందనుండి మిత్రుల అభినందనల పరంపర వైర్ లెస్ సెట్ లోనుండి వినబడుతోంది. వాళ్ళంతా మాకు ఉత్సాహాన్ని కల్గించడానికి పాటలు పాడసాగారు.

మెల్లగా దిగటం ప్రారంభించాం. దిగివచ్చేటప్పుడు గూడా చాలా శ్రమపడ్డాం.

చిట్టచివరకు ఆ భగవంతుని దయవలన క్షేమంగా దిగువ మజిలీని చేరుకున్నాం.

అక్కడ మా మిగిలిన మిత్రులు అంతా ఆనందోద్వేగాలతో మమ్మల్ని ఆలింగనం చేసుకొని హార్దిక స్వాగతం పల్కారు.

మా సాహసక్రియకు ఉత్తేజితులైన మరో బృందం కర్నల్ రెడ్డి నాయకత్వంలో ప్రొఫెసర్ మూర్తి, జాబేదాలు శిఖరారోహణకు తయారయ్యారు.

అయితే వాళ్లు బయలుదేరి బోయే సమయానికి వాతావరణం విపరీతంగా చెడిపోయింది. 'వాతావరణ పరిసితి విషమిస్తోందని, మంచుతుఫాన్ రాబోతున్నదని, వెంటనే క్రిందకు ప్రయాణమవ్వమని' ఢిల్లీనుండి వైర్ లెస్ మెసేజ్ వచ్చింది.

పాపం మా మిత్రబృందమంతా ఎంతో నిరుత్సాహాన్ని పొందింది.

అంతా కలిసి క్రిందకు ప్రయాణమయ్యాం.

మా తిరుగుప్రయాణంలో ఒకగొప్ప విశేషం జరిగింది. నిజంగా అది ఒక మరపురాని సన్నివేశం. అలాంటి దృశ్యం ఎదురవుతుందని మేం కలలోగూడా వూహించ లేదు.

ఆ రోజు సరిగ్గా సౌత్ కోల్ నుండి దిగువ మజిలీని చేరుకోబోతున్నాం. అంతలో ఇంతవరకు ప్రపంచంలో ఏ మానవుడు చూడని దృశ్యాన్ని మేం చూశాం. ఆ హిమవత్పర్వత సానువుల్లో మాకు అపూర్వమైన మంచు మనిషి సాక్షాత్కరించాడు.

హిమవత్పర్వత సానువుల్లో మానవులు చొరలేని ప్రదేశాలలో కొన్ని భయంకరమైన జంతువులు విహరించే యని మనకు కొన్ని గ్రంథాలు చెబుతున్నాయి. అయితే దీనికి సాక్ష్యాధారాలు బహుస్వల్పం.

మొదట్లో మేం భ్రమపడ్డామేమోననుకున్నాం. కానీ జరిగినది యథార్థమని తెలిసిన తరువాత మా ఆశ్చర్యానికి మేర లేకపోయింది.

ఆ రోజు అంతా టిఫిన్ చేసి సుడారాలలో విశ్రాంతి తీసుకొంటున్నారు. నేనూ, మిసెస్ జుబేదా కెమేరాలు తీసుకొని బయటకు వచ్చాం. రమణీయమైన ప్రకృతిని కెమేరాలలో బంధిస్తూ చాలాదూరం నడిచాం.

ఒకచోట హఠాత్తుగా ఆగిపోయాము. క్రింద మంచు మీద పెద్ద పెద్ద పాదముద్రలు కన్పించాయి. ఒక్కసారి ఆశ్చర్యపోయాం. ఆ పాదం కొలత షుమారు రెండడుగులు వుంది. సామాన్యంగా మనిషి పాదం ఏడునుంచి ఎనిమిది అంగుళాలు వుంటుంది. మరి ఆ అడుగులు ఎవరివి?

ధైర్యంచేసి ఆ అడుగులను అనుసరించాం. కొద్దిదూరం నడిచేసరికి ఆ అడుగులు మాయమయ్యాయి. గబగబ సాధ్యమయినంతవరకు ఆ అడుగులను ఫోటోలు తీశాం.

తరువాత యీ విషయమంతా మా బృందంతో ముచ్చటిస్తే, అంతా నవ్వారు. అదేదో మంచు మృగమయి వుంటుందని అన్నారు. కానీ నా అనుమానం నివృత్తి కాలేదు. ఆ పాదముద్ర సరిగ్గా మనిషి పాదముద్రనే బోలివుంది. కాకపోతే పరిమాణంలో పెద్దది.

నేను అది జంతువుకాదని, మనిషి అయివుండాలని వాదించాను. కానీ నా వాదన నెవరూ లక్ష్యపెట్టలేదు. అయితే కర్నల్ రెడ్డి మాత్రం నాతో ఏకీభవించి, ఆ అడుగుల తాలూకు ప్రాణిని కనుగొనడానికి నాతో సిద్ధమయ్యాడు.

ఆ రాత్రి మేం నిద్రపోలేదు. టార్చ్‌లైట్లు తీసుకొని ఇద్దరం బయలుదేరాం.

దాదాపు మూడుగంటల అన్వేషణ పిదప మా శ్రమ ఫలించింది. ఓ మంచుదిమ్మ ప్రక్కనే ఏదో ఆకారం కన్పించేసరికి, టార్చిఫోకస్ అటువైపు తిప్పాము.

అంతే, ఆ ఆకారాన్ని చూసి అదిరిపోయాం.

అచ్చు మనిషిలా వుందా ఆకారం. అతని శరీర మెంతో పెద్దది. దాదాపు పదకొండు అడుగుల ఎత్తువుండవచ్చు. చేతులు చాలా పొడుగైనవి. మెడమాత్రం సన్నగా వుంది. శరీరమంతా దట్టమైన వెంట్రుకలతో కప్పబడి

వుంది. వెంట్రుకల పొడవు దాదాపు ఏడు అంగుళాలు వున్నాయి. ఆ ఆకారం శరీరమంతా బూడిదరంగులో వుంది. ముఖకవళికల ప్రకారం, చప్పిడిముక్కు, దూసుకు పోయే చిన్న కళ్లు, విశాలమైన నుదురు ప్రత్యేకతను కల్గిస్తున్నాయి. ఖాళీ దాదాపు ఓ మీటరు పొడవుంది. తోక ఏమైనా వుందేమోనని పరిశీలనగా చూశాం. ఏమీ లేదు.

మా టార్చ్ వెలుగు ఒక్కసారి అతనిపై పడగానే, మంచుమనిషి అదిరిపడి లేచి మావైపు తిరిగాడు. అతను మావైపు సూటిగా చూశాడు. అప్పుడతని ముఖభంగిమలు అచ్చు మనిషి ముఖభంగిమలను పోలి వున్నాయి. అతను మమ్మల్ని చూసి, పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ వెళ్ళి పోయాడు.

అతను వెళ్ళిపోయిన తరువాత మేం చేసిన పొరబాటు గుర్తుకు వచ్చింది. మేం వచ్చేటప్పుడు కెమేరా తెచ్చి వుంటే, మంచుమనిషిని ఫోటో తీసి వుండేవాళ్ళం. మంచి ఛాన్స్ తప్పింది.

ఇద్దరం గూడారాన్ని చేరుకున్నాం. ఈసారి మా మాటలను కొంచం విశ్వసించారు. మనిషి ఆకారంలో వుంది కాబట్టి ఆ ప్రాణిని 'మంచుమనిషి'గా సంబోధించ సాగాం.

మంచుమనిషి మళ్ళీ కనబడతాడేమోనని దాదాపు మూడురోజులు ఎదురుచూశాం. లాభంలేకపోయింది. చివరకు విసుగుచెంది క్రిందకు ప్రయాణమయ్యాం. నాకు మాత్రం మంచుమనిషిని మరోసారి చూడాలనేవుంది.

అంతాకలిసి కొంతదూరం ప్రయాణించాం. అప్పుడు వుదయం ఎనిమిది గంటలయింది. హఠాత్తుగా ఓ చోట ఆగిపోయాను. ఎదురుగా నేను ఎదురుచూసే అద్భుతం

నిలబడివుంది. మంచుతో కప్పబడిన ఓ పెద్ద ఆకారం నాకు కన్పించింది.

వెంటనే అందరికీ సైగచేసి చూపించాను. అంతా ఆ మంచుమనిషిని చూసి ఆశ్చర్యపోయారు.

అంతలో గుర్తువచ్చింది. చటుక్కున ఫ్లాష్ కెమేరా తీసి క్లిక్ మనిపించాను.

అప్పటివరకు మావైపు ఆశ్చర్యంగా చూస్తున్న ఆ మంచుమనిషి ఫ్లాష్ వెలుగు పడగానే, గిరుక్కున వెనక్కు తిరిగి కైలాస పర్వత శ్రేణిలోకి నడిచిపోయాడు.

అంతా మంచుమనిషిని కనిపెట్టినందుకు నన్నెంతో పొగిడారు. మంచుమనిషి గురించి వూహాగానాలు చేసు కుంటూ క్రిందకు దిగాం క్షేమంగా.

క్రిందకు విజయవంతంగా దిగిన మాకు సిన్హాగారు ఘనమైన స్వాగతం పల్కటం, తరువాత నాకు బిరుదు నిచ్చి గౌరవించడం, అంతా మీకు తెలిసిందేకదా!

ఇప్పటివరకు మీ అందరిముందు నా యాత్రావిశేషాలు వివరించడానికి తగిన అవకాశాన్ని కలిగించిన సిన్హాగారికీ, శ్రద్ధగావిన్న మీకు నా హృదయపూర్వక ధన్యవాదాలు. శెలవ్."

తన సుదీర్ఘ వుపన్యాసాన్ని ముగించి కుర్చీలో కూర్చున్నారు ప్రొఫెసర్ దయాళ్.

హాలు అంతా కరతాళ ధ్వనులు మిన్నుముట్టాయి.

ప్రిన్సిపాల్ సిన్హాగారు, మిగిలిన పర్వతారోహకు లందర్నీ పేరుపేరునా సభికులకు పరిచయం చేశారు.

## 3

"గుడ్ మార్నింగ్ సర్."

"మార్నింగ్. కమాన్ బోయ్" నవ్వుతూ ఆహ్వా నించారు ప్రిన్సిపాల్ సిన్హా.

బ్రిగేడియర్ జైల్‌సింగ్ గంభీరంగా లోపలికు ప్రవేశించి, ప్రిన్సిపాల్‌కు ఎదురుగావున్న మరో కుర్చీలో కూర్చున్నాడు.

"ప్రొఫెసర్ దయాళ్, మీట్ మిస్టర్ జైల్‌సింగ్, బ్రిగేడియర్" పరిచయం చేశారు సిన్హా.

"గ్లాడ్ టు మీట్ యు సర్" షేక్‌హాండిచ్చాడు సింగ్.

"సేమ్ టు యు" చిన్నగా నవ్వాడు ప్రొఫెసర్.

"వాట్ మై బోయ్, ఏమిటి విశేషాలు? ఇంకా ఎన్ని రోజులు నీకు శెలవుంది?"

"మరో అయిదురోజులు వుంది సర్. ఇంకా రెండు నెలలు శెలవ్ను పెంచుదామని చూస్తున్నాను."

"ఎందుకు? ఎక్కడకన్నా టూర్ ప్రోగ్రాముందా?"

"ఎస్ సర్. అందుకు మీ సలహా, ప్రొఫెసర్ గారి సహాయం నాకు కావాలి."

చిన్నగా నవ్వారిద్దరూ.

"హిమాలయాల్లోని సౌత్ కోల్ వరకు ఓసారి వెళ్ళి రావాలనివుంది సర్. మంచుమనిషి గురించిన స్పష్టమైన వివరాలు సేకరించాలి" చెప్పాడు సింగ్.

"మంచుమనిషి గురించా?" ఆశ్చర్యంగా ముందుకు వంగాడు ప్రొఫెసర్.

"అవును సర్. మీరు నిన్న మీ ఎవరెస్ట్ శిఖరారోహణ గురించి చెబుతూ, మంచుమనిషి గురించి తెలియచేశారు గుర్తుందా? అప్పటినుండి ఆ మంచుమనిషి గురించి తీవ్రంగా ఆలోచిస్తున్నాను. నిన్న మా మిలటరీ చీఫ్ తోనూ, ప్రభుత్వాధికారులతోనూ ట్రంక్‌ఫోన్‌లో చర్చించి, చివరకు వారి సలహాపై ఒక నిర్ణయానికి, అంటే మంచుమనిషి గురించి పూర్తివివరాలు సేకరించా

అని నిర్ణయించుకున్నాను."

"మైడియర్ బ్రిగేడియర్" చిన్నగా అన్నారు సిన్హా. "మంచుమనిషిగురించి హఠాత్తుగా నీకు ఎందుకు ఇంట్రెస్ట్ కలిగింది? అందులోనూ దీనిగురించి ప్రభుత్వాధికారులను సంప్రదించవలసిన అవసరం ఎందుకు కలిగింది?"

చిన్నగా నవ్వాడు జైల్‌సింగ్.

"ప్రొఫెసర్ దయాళ్ గారు మంచుమనిషి గురించి చెప్పినప్పుడు నాకు ఓ అనుమానం వచ్చింది. మంచు మనిషి ఆకారం, ఆతని చేష్టలు నా అనుమానాన్ని మరింత బలపరిచాయి. నా అనుమానం ప్రకారం హిమాలయాలపై పెద్ద కుట్ర జరుగుతోంది. మనదేశ క్షేమానికి అది గొడ్డలి పెట్టువంటిది."

"వాట్?" అదిరిపడ్డాడు ప్రొఫెసర్ దయాళ్.

"మంచు మనిషి మనదేశానికి అపాయం తల పెడతాడా?"

"అవును సర్. నా అంచనాల ప్రకారం ఆ ఆకారం మంచుమనిషి రూపంలోవున్న కృత్రిమ రసాయనిక యంత్ర మానవుడు. ఇదంతా చైనా పన్నాగమని నాఅనుమానం. మైడియర్ సర్స్, చైనా మనకు బద్ధశత్రువు. అనుక్షణం మన పతనాన్ని వాంఛించే చైనా, ఆ పతనం కొరకు అనేక మార్గాలద్వారా ప్రయత్నిస్తున్నది. ఇటీవలచైనా తన గూఢచారి చర్యలను విస్తృతం చేసింది. మీకు హిమాలయాలపై కనబడిన ఆ మంచుమనిషి ఎటువంటి జంతువుకాదని, అది మనదేశ భద్రతకు సంబంధించిన విషయాలు సేకరించడానికి చైనా వినియోగించే రాడార్ మనిషి అని నా ప్రగాఢ అభిప్రాయం."

"వాట్ మై బోయ్, రాడార్ మనిషా?" విస్తుపోతూ అడిగారు సిన్హా.

"అవును సార్. ఈ ఆధునిక యంత్ర యుగంలో రాడార్ మనిషి అంటే పెద్ద విచిత్రమేమీ లేదు. మనిషి ఆకారంలో సంచరిస్తూ పరిసరాలకు సంబంధించిన విషయాలను సేకరించి రిసీవింగ్ స్టేషనుకు వార్తలు పంపే రాడార్ యంత్రమన్నమాట!"

"నో. నేను నమ్మలేకపోతున్నాను" ఆశ్చర్యంగా అన్నాడు ప్రొఫెసర్ దయాళ్.

"కళ్ళారా చూసిన మీరు యీ విషయం నమ్మలేరు సర్. అది సహజం. నిన్న నా అనుమానాన్ని మా చీఫ్‌కు తెలియచేశాను. వెంటనే చీఫ్ ఎస్. బి. డి.ని సంప్రదించారు. అంతా సావకాశంగా పరిశీలించిన తరువాత సీక్రెట్ బ్రాంచ్ డైరెక్టర్ నా అనుమానాన్ని అంగీకరించారు. తమ బ్రాంచ్‌కు గూడా, చైనా మన దేశంలో అతినైపుణ్యంగా గూఢచారి చర్యలు సాగిస్తున్నట్లు సమాచారం వచ్చిందట. మంచుమనిషిపై నాకీ అనుమానం కల్గినందుకు నన్నభినందిస్తూ వెంటనే కార్యాచరణకు పూనుకొమ్మని మా చీఫ్‌ద్వారా ఆదేశం పంపించారు."

"బ్రిగేడియర్, నీమాట కాదనలేకపోతున్నాను. కానీ మంచుమనిషి వెనుక యింతటి చరిత్ర వుంటుందని వూహించలేకపోతున్నాను. విష్ యు బెస్టాఫ్ లక్" అన్నారు సిన్హా.

"థాంక్యూ సర్. నాకు కావలసిన సాధన సామగ్రినంతా మన ఇన్‌స్టిట్యూట్ నుండి తీసుకోమన్నారు. మీకు త్వరలోనే ఆర్డర్స్ పంపిస్తామన్నారు. కాబట్టి యీ విషయంలో మీరు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని మాకు తోడ్పడాలి" చెప్పాడు జైల్‌సింగ్.

"విత్ ప్లెజర్. అదీగాక యీసారి ప్రయాణ సన్నా

హాలు చాలా తేలిక. ఎందుకనంటే, మొన్న నేగా ప్రొఫెసర్ దయాళ్ బృందానికి ఏర్పాట్లు చేసింది. వాటిలో చాలావరకు మళ్ళీ మీకు వుపయోగపడతాయి."

"థాంక్యూ సర్."

"ప్రొఫెసర్ జీ" పిలిచాడు సింగ్.

"వాట్ మిస్టర్ సింగ్?"

"మీకు అభ్యంతరం లేకపోతే, మిమ్మల్ని మరోసారి వుపయోగించుకొమ్మని మా చీఫ్ చెప్పారు. ఇప్పుడు నాకు సహాయంగా సీక్రెట్ బ్రాంచ్ నుండి స్పెషల్ ఏజంట్ ఒకరు వస్తారు. మీరుగూడా మా వెంట వస్తే చాలా బావుంటుంది."

చిన్నగా నవ్వాడు ప్రొఫెసర్ దయాళ్.

"డియర్ బ్రిగేడియర్, నీ వుత్సాహం, మంచుమనిషి గురించి నీ వూహాగానాలు వింటుంటే నాకూ వద్దామని ఎంతో వుత్సాహంగావుంది. కానీ అది అసాధ్యం. నేను ఎవరెస్టు నధిరోహించి పూర్తిగా నెలగూడా కాలేదు. ఇప్పుడు మళ్ళీ పర్వతాలను ఎక్కడమంటే చాలాకష్టం. శారీరకంగా నాకు పూర్తి విశ్రాంతి కావాలి. కాబట్టి నేను రాలేను."

"బాడ్ లక్ సర్. మీ సహకారం నాకు చాలా కావాలి. మంచుమనిషి ఫోటో, మరికొన్ని వివరాలు కావాలి."

"అలాగే. తప్పకుండా యిస్తాను."

"మిస్టర్ సింగ్, మొత్తం ఎంతమంది వెళ్దామని నిశ్చయించుకున్నారు?" అడిగారు నీనా.

"మొత్తం ముగ్గురం వెళ్దామని నిశ్చయించుకున్నాం సర్. స్పెషల్ ఏజంట్ యారోజా వస్తారు. అతను మీకు తెలిసేవుంటాడు. మన ఇన్స్టిట్యూట్ లో శిక్షణ

పొందినవారిలో కొద్దిమంది, ఎస్. బి. లో కూడా ప్రవే
శించారుకదా! ఇకపోతే మూడవవ్యక్తిని మీరు నిర్ణయిం
చండి."

ఓ నిముషం ఆలోచించారు సిన్హాగారు.

"మిస్టర్ సింగ్, జయాల్ నీకు తెలుసుకదా?"

"మిస్టర్ జయాల్! ఆఁ తెలుసు. నన్ను హోటల్
నుండి యిక్కడకు తీసుకువచ్చిన వ్యక్తేకదా?"

"ఎస్ కరెక్ట్. జయాల్ మంచి చురుకుదనం గల
వాడేగాక సాహసికుడుకూడా. అతనికి పర్వతారోహణ
అంటే చాలా ఇంట్రస్టు. అతనినికూడా తీసుకువెళ్ళండి."

"అలాగే సర్" అన్నాడు జైల్ సింగ్.

## 4

"నా పేరు జైల్ సింగ్. బ్రిగేడియర్ను" తనకు కావల
సిన వ్యక్తి ప్లేన్ దిగగానే దగ్గరకువెళ్ళి పరిచయం చేసు
కున్నాడు.

"గ్లాడ్ టు మీట్ యూ. నా పేరు నరీందర్ కుమార్.
స్పెషల్ ఏజంట్ను. నరీందర్ అని పిలవండి" చిన్నగా
చెప్పాడు.

నరీందర్ను పరీక్షగా చూశాడు సింగ్.

సన్నగా, ఎత్తుగా, రివటలా వున్నాడు. స్ట్రిచ్ లిన్
సూట్ ధరించాడు. కాళ్ళకు పాయింటెడ్ షూస్,
కళ్ళకు గ్రీన్ గాగుల్స్ మెరుస్తున్నాయి.

"రండి" ఎయిర్ పోర్ట్ లోని రెస్టారెంట్ లో ఫ్యామిలీ
రూంలోకి దారితీశాడు జైల్ సింగ్.

ఇద్దరూ స్క్వేర్ టేబుల్ దగ్గర కూర్చున్నారు.

బేరర్ వచ్చాడు.

"ఏం తీసుకుంటారు?" అడిగాడు బ్రిగేడియర్.

"ఎనీ హాట్ డ్రింక్" చెప్పాడు నరీందర్.

"లార్జ్ స్కాచ్ విస్కీబాటిల్, ఐస్ క్యూబ్స్" ఆర్డరిచ్చాడు.

మరుక్షణంలో టేబిల్ మీద ప్రత్యక్షమయ్యాయి.

రెండుగ్లాసులనిండా ఐస్ క్యూబ్స్ వేసి, విస్కీ పోశాడు. తెల్లగా నురుగువచ్చింది.

నరీందర్ కు ఒకటి ఆఫర్ చేసి తనొకటి తీసుకొన్నాడు.

"మంచుమనిషి గురించి వివరంగా చెప్పండి" విస్కీ చప్పరిస్తూ అడిగాడు.

గ్లాసు ఖాళీచేసి మరికొన్ని ఐస్ క్యూబ్స్ వేసుకొని విస్కీ వంచుకున్నాడు బ్రిగేడియర్.

"హిమత్పర్వత సానువుల్లో ఎవరెస్టు కెళ్ళేదారిలో 8,000 మీటర్ల ఎత్తులోవుంది సౌత్ కోల్ ప్రాంతం. ప్రొఫెసర్ దయాళ్ బృందం ఎవరెస్టు శిఖరారోహణ పూర్తి చేసుకొని క్రిందకు దిగివస్తూ సౌత్ కోల్ వద్ద టెంట్ వేశారు. ప్రొఫెసర్, మిసెస్ జాబేదాలు ప్రకృతిసందర్శనానికై బయటకువచ్చి అటూయిటూ తిరుగుతున్న సమయంలో వారికి పెద్దపెద్ద పాదముద్రలు కన్పించాయి. అవిచూచి వాళ్ళు ఆశ్చర్యపోయి ఆ అడుగులను ఫోటో తీశారు. ఆ పాదముద్ర కొలత దాదాపు రెండడుగులు వుంది. ఆ పాదముద్రలను ఆధారంగా తీసుకొని ప్రొఫెసర్, కర్నల్ రెడ్డి అన్వేషణ ప్రారంభించారు. ఆ అన్వేషణలో వారికొక వింత ఆకారం కనబడింది. ఆ ఆకారాన్ని ఫోటో తీశారు చాకచక్యంగా.

"ఆ ఫోటో మీ దగ్గర వుందా?"

"ఆఁ" జేబులోనుండి రెండు ఫోటోలు తీసి టేబుల్ మీద పెట్టాడు సింగ్.

ఆ ఫోటోలను పరిశీలనగా చూస్తూ "ఇంకా మంచుమనిషి వివరాలు చెప్పగలరా?" అడిగాడు నరీందర్.

"మంచుమనిషి ఎత్తు పదకొండు అడుగులు. పొడవైన చేతులు, సన్నని మెడ అతని ప్రత్యేకత. శరీరమంతా దట్టమైన వెంట్రుకలతో నిండివుంది. చప్పిడి ముక్కు, చిన్న కళ్లు, విశాలమైన నుదురు కలిగి వున్నాడు. అతని ఛాతీ దాదాపు మీటరు పొడవుంది."

"దట్సాల్. మంచుమనిషి గురించి యీ వివరాలు చాలు. ఇక మనం పరిశోధన ప్రారంభించవచ్చు."

"ఈ తరనబట్టి మంచు మనిషిమీద మీ అభిప్రాయం ఏమిటి?" అడిగాడు సింగ్.

"సారీ, పూర్వోజనితమయిన అభిప్రాయాలు స్పష్టమైనవి కావు. తగిన ఆధారాలు లభించనిదే ఏమీ చెప్పలేను" బాటిల్‌లో మిగిలింది గ్లాలో వంచుతుంటూ చెప్పాడు నరీందర్.

"దట్స్‌గుడ్!" ఎగ్రీ అయ్యాడు సింగ్.

"మిస్టర్ సింగ్, ముందుగా సిన్హాగారినీ, ప్రొఫెసర్ దయాళ్ గారినీ కలవాలి. పదండి" తన సీటులోనుండి లేచాడు స్పెషల్ ఏజంట్ నరీందర్.

బిల్ చెల్లించి రెస్టారెంట్ నుండి బయటపడ్డారిద్దరూ.

# 5

సెప్టెంబర్ 1వ తేదీ.

సిన్హా, జైల్‌సింగ్, నరీందర్, జయాల్ అంతా కారులో జయనగర్ బయలుదేరారు. కారు వెనకే సామానులతో ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన వాన్ బయలుదేరింది.

కారు జయనగర్ చేరేసరికి, అక్కడ షెర్పాల నాయకుడు ఫోండోప్ అందరకూ స్వాగతంపల్కి, చక్కని ఆతిథ్యం యిచ్చాడు.

అంతకుముందే సిన్హాగారి వర్తమానం అందుకున్న

థోండోప్ బందమంది షర్పాలతో పర్వతారోహణకు రెడీగా వున్నాడు.

అంతా భోజనాలు ముగించి బయలుదేరారు.

మొత్తం సామానులు రెండు టన్నుల బరువుంటుంది. అన్నీ 20 కిలోల బంగీలుగా సర్దారు. ఒకొక్క షర్పా ఒకొక్క బంగీ అందుకున్నాడు.

"సర్, మమ్మల్ని ఆశీర్వదించండి" చిన్నగా తలవంచి అన్నారు ముగ్గురు పరిశోధకులూ.

గంభీరంగా నవ్వారు సిన్హా.

"మైడియర్ యంగ్ బాయిస్, మంచుమనిషి మర్మాన్ని ప్రపంచానికి తెలియచేసి, భారతదేశం పేరు ప్రతిష్టలను మరోసారి జగద్విదితం చేయండి. విష్ యూ ఆల్ సక్సెస్" అందరితో కరచాలనం చేస్తూ విష్ చేశారు సిన్హా.

"థాంక్యూ సర్!" ముక్తకంఠంతో పల్కి ముందుకు సాగారు ముగ్గురూ.

షెర్పాలబృందంగూడా జట్లుజట్లుగా చీలి పరిశోధకుల ముగ్గుర్నీ అనుసరించింది.

జయనగర్ వదిలిపెట్టి వారం రోజులయింది.

ఏరోజు కారోజు నరేందర్ తమ బృందం ప్రోగ్రెస్‌ను ఎస్. బి. డి. కి, సిన్హాకి వైర్‌లెస్‌లో తెలియచేస్తూనే వున్నాడు.

ఈ వారం రోజులలోనూ మంచుమనిషి గురించి మరి కొన్ని వివరాలు తెలిశాయి.

మార్గమధ్యంలో అక్కడ నివశించే లింబూ, రాయి, తమంగా మొదలగు తెగలవారిని స్నేహం చేసుకుంటూ మంచుమనిషి గురించి ఆరాతీయసాగారు.

అక్కడి తెగల వారంతా బౌద్దమతానికి చెందిన వారు. వారిలో భక్తి ప్రవృత్తి, అతిధి మర్యాద అధికం.

నరేందర్ చాలా తెలివిగలవాడు. అతి నైపుణ్యంగా వారివద్దనుండి సమాచారం రాబట్టడానికి ప్రయత్నించే వాడు.

మరో వారం రోజులకు అతని విచారణ ఫలించింది.

లింబూ తెగ నాయకుడు లుముంబాతో బౌద్ధమతం గురించి చర్చిస్తూ, సంభాషణను మంచుమనిషి వైపు తిప్పాడు.

"బుద్ధుడు ఇరవయ్యో శతాబ్దంలో మంచుమనిషిగా హిమత్పర్వత సానువుల్లో అవతరిస్తాడని బౌద్ధమత గ్రంథాలు చెబుతున్నాయట. నిజమేనా?"

చిన్నగా వులిక్కిపడ్డాడు లుముంబా.

"మీ కెవరు చెప్పారు నరేందర్‌జీ" ఆశ్చర్యంగా అడిగాడు.

"మా రాష్ట్రంలో ఒక బౌద్ధమత ప్రచారకుడు చెబుతుంటే విన్నాను. నిజమేనా?"

"ఏమో నరేందర్‌జీ. నాకు తెలిసినంత వరకు మత గ్రంథాలలో మంచుమనిషి ప్రసక్తి లేదుగానీ, కూమ్ మంచు నది పరిసరప్రాంతంలో ఏదో పెద్ద మంచులో కప్పబడిన ఆకారాన్ని చూశామని, ఆ ఆకారం అచ్చు మనిషిని బోలివున్నదని మా తెగలో ఇద్దరు యువకులు చెప్పారు."

"వాళ్ళు కూమ్ ప్రాంతానికి ఎందుకు వెళ్ళారు?"

"యువకులు. పర్వతాలను అధిరోహించడమంటే వుత్సాహం కలవారు. సరదాగా వెళ్ళొద్దామని 'కూమ్' వరకు వెళ్ళివచ్చారు."

"ఇప్పుడా యువకులను కలుసుకోవడానికి వీలుంటుందా?"

తలవంచుకొని చిన్నగా అన్నాడు లుముంబా.

"లేదు నరేందర్ జీ. ఆ మంచుమనిషి ఎవరో కానీ, సామాన్యుడు కాడు. అతన్ని చూసిన ఆ యువకులిద్దరికీ ఏదో శాపం పెట్టాడు. పాపం ఆ యువకులు మంచు మనిషిని కలవరిస్తూనే మరణించారు. ఆ క్షణంనుండి మాలో ఎవరమూ, మళ్ళీ మంచుమనిషి ప్రసక్తి రాకుండా జాగ్రత్తపడుతూ కాలం గడుపుతున్నాం. ఇప్పుడుగూడా అప్రయత్నంగానే యీ విషయం మీకు చెప్పాను. మంచు మనిషి మాపై ఏం పగపడతాడో ఏమో?" చిన్నగా వణుకుతూ చెప్పాడు.

మృదువుగా నవ్వాడు నరేందర్.

"లుముంబా! మీరు మంచుమనిషి గురించి అనవసర భయాందోళనలు చెందకండి. ఆ మంచుమనిషి గుట్టు బయటపెట్టడానికే మేం వెడుతున్నాం. ధైర్యంగా వుండండి" భుజంతట్టి ముందుకు నడిచాడు నరేందర్.

## 6

బ్రిగేడియర్ బృందం 3,960 మీటర్ల ఎత్తునవున్న 'పాంగ్ బోచె' ప్రాంతాన్ని చేరుకునేసరికి, అక్కడకు ముందుగా చేరిన ఓ షెర్పాల బృందం గుడారాలు వేసి, రెడీగా వున్నారు.

జైల్ సింగ్ అప్పటివరకు తమకు సహాయంగా వచ్చిన వందమంది షెర్పాలలో మెరికల్లాంటి వారినో ఇరవై మందిని వుంచుకొని, మిగిలిన వారికి డబ్బులిచ్చి వీడ్కోలు చెప్పాడు.

ఓ గంటలో వంటలు పూర్తయ్యాయి.

అంతా భోజనాలు చేసేసరికి, టైం ఏడు దాటింది. ఒళ్లు జలదరించిపోయేటట్లు చలిగాలులు వీస్తున్నాయి.

అంతా సర్దుకొని షెర్పానాయకుడు ధోండోప్ ముగ్గురికీ గుడ్ నైట్ చెప్పి తమ గుడారంలోకి నడిచాడు.

పరిశోధకులు ముగ్గురూ స్లీపింగ్ బ్యాగ్స్‌లోకి దూరారు.

సిగరెట్ వెలిగించి గట్టిగా దమ్ము పీలుస్తూ అన్నాడు సింగ్.

"మిష్టర్ నరీందర్, మీరు చెప్పిన విషయం విన్న తరువాత మంచుమనిషిపై నా అనుమానం మరింత బలపడుతోంది. బహుశా ఆ రాడార్ యంత్రానికి ఎదురుగా మనుషులు కనబడితే, ఆ యంత్రంనుండి ఏవైనా విషపూరిత కిరణాలు ప్రసరించి ఆ మనుషులను తాకే ఏర్పాటు ఏదన్నా వుండివుంటుంది. ఆ కిరణాల ప్రభావానికి వాళ్లు మరణిస్తే, మూఢులైన ఆ తెగవారు అది మంచుమనిషి విధించిన శాపంగా భ్రమపడుతూ భయపడుతున్నారు.'

"కరెక్టు సర్. మీ అభిప్రాయంతో నేనూ ఏకీభవిస్తున్నాను" అన్నాడు జయాల్.

"మిష్టర్ సింగ్, పై సంఘటననుబట్టి, ప్రొఫెసర్ బృందంపై కూడా ఏదైనా అఘాయిత్యం జరిపివుంటాడా మంచుమనిషి?" చిన్నగా అడిగాడు నరేందర్.

"ఏమో? బహుశా ప్రొఫెసర్ బృందం ఆ కిరణాల ప్రభావానికి లోనుగానంత దూరంలో నిలబడివుంటారు. ఏదిఏమైనా మంచుమనిషితో మనం చాలా జాగ్రత్తగా ప్రవర్తించాలి" అన్నాడు సింగ్.

"వెల్ డియర్ ఫ్రెండ్స్. ఇక రెస్టు తీసుకోండి. గుడ్ నైట్" ముఖంపై కవర్ లాక్కుంటూ అన్నాడు నరీందర్.

## 7

అక్టోబర్ ఆరవ తేదీకి 6,000 మీటర్ల ఎత్తునవున్న పశ్చిమకూమ్ చేరుకున్నారు.

పశ్చిమకూమ్ ఓ పెద్ద మంచునది. అక్కడనుండి ఎల్లవేళలా క్రిందకు మంచు ప్రవహిస్తూనే వుంటుంది.

కొద్దిగంటల్లోనే అక్కడ గుడారాల్ని నిర్మించారు షెర్పాలు.

ఓ పదిమంది షెర్పాలు ముందు దారి బాగుచేయడానికి గొడ్డళ్ళు, మేకులూ, జండాలు తీసుకొని ముందుకు సాగారు.

“ఉముంబా చెప్పిన ప్రకారం, మంచుమనిషి యీ కూమ్ నదీ తీరాలలో కూడా సంచరిస్తూండవచ్చు” అన్నాడు నరిందర్.

“ప్రొఫెసర్ గారికి మంచుమనిషి కనబడింది సౌత్ కోల్ వద్దకదా?” అడిగాడు సింగ్.

“అవును. కానీ, మనం ఇక్కడగూడా మంచుమనిషి గురించి అన్వేషిస్తే బావుంటుంది. మన అదృష్టం బాగుంటే మంచుమనిషి ఇక్కడే కనబడవచ్చు. ఇంకా రెండువేల మీటర్లు ఎక్కేబాధ తప్పుతుంది” చిన్నగా నవ్వాడు నరిందర్.

“మంచి ఆలోచన. అలాగే చేద్దాం” అన్నాడు జయాల్.

మంచుమనిషిని అన్వేషించడానికి బయలుదేరారు ముగ్గురు పరిశోధకులూ.

కూమ్ ప్రాంతమంతా మంచుగుట్టలు విపరీతంగా పేరుకుపోయి వున్నాయి. నిటనిలువుగావున్న ఆ గుట్టలను దాటటం చాలా కష్టం. అలాగే మెల్లగా అన్వేషణ సాగించారు.

దాదాపు అయిదుగంటలు తిరిగారు. ఎక్కడా మంచుమనిషి జాడలులేవు.

“ఇక్కడ మనం వెతకడం వృథా ప్రయాస. త్వరగా సౌత్ కోల్ చేరుకోవడం వుత్తమం” అన్నాడు సింగ్.

"వినో మిస్టర్ సింగ్. నా వూహ ప్రకారం మంచు మనిషి కేవలం ఒక్క ప్రాంతంలోనే వుండడు. సాధ్యమయినంత మేర తిరుగుతూనే వుంటాడు. ఈ మన అన్వేషణ ఫలించకపోతే, ఎలాగూ ముందుకు పురోగమించక తప్పదు" అన్నాడు నరేందర్.

జయాల్ వుత్సాహంగా పరిసరాలను పరికిస్తూనే వున్నాడు.

అంతా మంచు వర్షంలా కురుస్తోంది. పవర్ ఫుల్ బైనాక్యులర్స్ ధరించినా, ఎంతో దూరం కనబడటం లేదు.

మీల్స్‌కు టైం అవడంతో, అంతా మళ్ళీ గుడారం దగ్గరకు బయలుదేరారు.

గుడారం చేరుకొనేసరికి వంటలు రెడీ అయిపోయి వున్నాయి.

అంతా భోజనాలు పూర్తిచేసి విశ్రమించారు.

జయాల్‌కు ఎంత ప్రయత్నించినా నిద్రరావడంలేదు. అతని ధ్యాస అంతా మంచుమనిషిమీదే వుంది. అతని ఆలోచనలు పరిపరివిధాల పోతున్నాయి.

'తాము ఇంతా కష్టపడి మంచుమనిషి ఆచూకీతీస్తే, తీరా అదేదో మంచు జంతువు కాదుగదా!' అని ఓ ఆలోచన.

'మంచుమనిషి నిజంగా ఏ విదేశ గూఢచారో అయితే, యీ పాటికి తమ ఆగమనవార్త తెలిసి, తమను ఎటాక్ అవడానికి రెడీ అవుతుంటాడేమోనని' ఓ భయం.

పెద్దగా ఏదో శబ్దమయింది.

ఉలిక్కిపడి లేచి నిల్చున్నాడు జయాల్. అతని గుండెలు వేగంగా స్పందించసాగాయి.

'ఒకవేళ మంచుమనిషి తమ గుడారంమీదకు దండెత్తి

రావడంలేదు కదా!'

రివాల్వరు పొజిషన్‌లో వుంచుకొని ధైర్యంగా ముందుకు నడిచాడు.

గుడారం బయటకురాగానే, ఎదురుగా కన్పించిన దృశ్యం అతడ్ని ఆశ్చర్య చకితుడ్ని చేసింది.

ఓ పెద్ద మంచుబండ ఎక్కడనుండో పెద్దగా శబ్దం చేసుకుంటూ జారిపడిందేమో, గుడారం ముందుగా పడి వుంది.

'ఆ బండ ఇంకొంచెం ముందుకుజారి గుడారంమీద పడివుంటే...?' ఓ క్షణం గుండె ఆగిపోయినట్లనిపించింది.

గబగబ లోపలకువెళ్ళి నరీందర్‌ను, సింగ్‌ను నిద్రలేపి సంగతంతా వివరించి చెప్పాడు.

అంతా బయటకువచ్చి, మంచుబండను చూసి నిశ్చేష్టులై నిలబడిపోయారు. కొద్దిలో తప్పిన ప్రమాదాన్ని తలచుకొన్న అందరి గుండెలు ఒక్కసారిగా జలదరించాయి.

ఆ శబ్దానికి ధోండోప్, మిగిలిన షెర్పాలుగూడా బయటకు వచ్చారు.

జైల్‌సింగ్ ఓసారి పరిసరాలను పరీక్షగా చూశాడు.

అంతా దట్టంగా మంచు కురుస్తోంది. చల్లటి గాలులు తీవ్రమయ్యాయి.

ఉన్నట్లుండి కంగారుగా అరిచాడు సింగ్.

"మిష్టర్ నరీందర్, పడమటి దిక్కునుండి గాలి వుధృతం ఎక్కువయింది. ఇది మంచు తుఫాన్‌కు సూచన. కొద్ది సేపటిలో తీవ్రమైన మంచు తుఫాన్ రాబోతుంది."

"ఏం చేద్దాం సర్?" కంగారుపడుతూ అడిగాడు జయాల్.

"మనం వెంటనే రక్షిత ప్రాంతానికి తరలి వెళ్ళాలి.

ఇక్కడే మన గుడారం వుంటే, మంచు తుఫాన్‌లో మన ఆనవాళ్ళు గూడా దొరకవు."

నరీందర్ గబగబ మాప్ తీసుకు వచ్చాడు.

షెర్పాలు గుడారాన్ని క్లోజ్ చేసి సామాన్లు సర్దుకో సాగారు.

"మిస్టర్ సింగ్, మనం దాదాపు ఓ ముప్ఫయి మీటర్లు దిగువకు వెళితే, రక్షిత ప్రాంతం వస్తుంది. ఎగువకైతే షుమారు 50 మీటర్లు ప్రయాణించేస్తే కానీ రక్షిత ప్రాంతం రాదు. ఏ రక్షిత ప్రాంతాన్ని చేరుకోవాలో నువ్వే సెలెక్ట్ చేయి."

ఓ క్షణం ఆలోచించాడు సింగ్.

రాను రాను పైకి ఎక్కడం కష్టం. అదీగాక పైకి ఓ ఇరవై మీటర్లు ఎక్కువ ప్రయాణం చేయాలి. ఈలోగా మంచు తుఫాన్‌కు గురయ్యే ప్రమాదంగూడా వుంది. మళ్ళీ క్రిందకు వెళితే ఓ రోజు వృధా అయినట్లే! ఏది ఏమైనా పైకి వెళ్ళడం కన్నా, క్రిందకు వెళ్ళడమే క్షేమంగా తోచింది.

అదే చెప్పాడు అందరికీ.

అంతా దిగువ రక్షణ మజిలీకి ప్రయాణమయ్యారు.

"మనకన్నా ముందు వెళ్ళిన షెర్పాల బృందం ఎలా?" ఆందోళనగా అడిగాడు జయాల్.

"డోంట్ ఫియర్. వారంతా యీ సరికి ఎగువ రక్షణ మజిలీని చేరుకొని వుంటారు" చెప్పాడు నరీందర్.

కన్ను చించుకున్నా. కానరాని చీకటి విపరీతమైన మంచు కురుస్తోంది. ఒకరికొకరు వేరుకాకుండా అంతా నైలాన్ రోప్స్‌లను నడుంకు కట్టుకున్నారు. అందరి నడుములకు పవర్‌ఫుల్ టార్చిలైట్లు వ్రేలాడదీయబడి వున్నాయి.

తెల తెలవారుతూండగా రక్షిత ప్రాంతానికి చేరుకున్నారు. అంతా తృప్తిగా వూపిరి పీల్చుకున్నారు.

షెర్పాలు అరగంటలో టెంట్స్‌ను వేసేశారు.

అంతా టెంట్స్‌లో దూరి సొమ్మసిల్లి పడుకొని నిద్రపోయారు.

మరుసటిరోజు సాయంత్రానికి మంచుతుఫాన్ తగ్గగానే అంతా కూమ్ ప్రాంతాన్ని మళ్ళీ చేరుకున్నారు.

రాత్రి విశృంఖలంగా వీచిన మంచుతుఫాన్ గుర్తుగా దొర్లిన పెద్దపెద్ద మంచుబండలు యింకా అక్కడే వున్నాయి. రాత్రి ధైర్యంగా గుడారం ఎత్తివేసి దిగువ రక్షణ మజిలీని చేరుకొని వుండకపోతే, అంతా మంచు తుఫాన్‌కు బలయిపోయి వుండేవారు.

ఇంకా కూమ్ ప్రాంతంలో మంచుమనిషిని అన్వేషించడం అర్థరహితం అనిపించింది జైల్‌సింగ్‌కు.

ఆ మాటే చెప్పాడు నరీందర్‌కు, జయాల్‌కు.

వాళ్ళుగూడా సింగ్‌తో ఏకీభవించారు. అంతా సౌత్‌కోల్‌కు ప్రయాణమయ్యారు.

కూమ్‌నుండి సౌత్‌కోల్‌ను చేరుకొనే దారి చాలా ప్రమాద భరితంగా వుంటుంది. అక్కడనుండి కొండలను ఏటవాలుగా ఎక్కాలి. అందుకే మంచును అక్కడక్కడ గొడ్డళ్ళతో నరుకుతూ మెట్లను ఏర్పాటు చేసుకుంటారు.

ముందు వెళ్ళిన షెర్పాల బృందం వెనకవచ్చేవారికి వీలుగా మంచు మెట్లను నిర్మించుంటూ, గుర్తుకు దారి పొడవునా జండాలు పాతుకుంటూ వెళ్ళారు.

అయితే దురదృష్టవశాత్తూ రాత్రి కురిసిన మంచు తుఫాన్‌కు చాలా మెట్లు పాడయిపోయాయి. కొన్ని జండాలు కూలిపోయాయి. అయినా పాడయిన మెట్లను బాగుచేసుకోవడం తేలిక కాబట్టి, ప్రయాణం వేగంగానే

సాగింది.

దాదాపు పదిహేను రోజులకు 7,800 మీటర్ల ఎత్తున వున్న ప్రదేశానికి చేరుకున్నారు. అక్కడకు వారు చేరుకొనేసరికి, ముందువెళ్ళిన షెర్పాల బృందం వారికి హార్దిక స్వాగతం పల్కింది.

అక్కడ వాతావరణానికి అనువుగా రెండు తేలిక గుడారాలు నిర్మించారు.

ఒకరోజు పూర్తిగా అక్కడ విశ్రాంతి తీసుకున్నారు.

సౌత్ కోల్ చేరుకోవడానికి ఇంకా రెండువందల మీటర్లు ప్రయాణం చేయాలి.

ఆ రోజు రాత్రి నరిందర్‌తోనూ, జయాల్‌తోనూ మంచుమనిషిని ఎదుర్కొనే విషయమై చర్చించాడు జైల్ సింగ్.

చివరకు షెర్పాలను అక్కడే వదిలి, తాము ముగ్గురే సౌత్ కోల్‌ను చేరుకోవాలని నిశ్చయించుకున్నారు.

మరుసటి రోజు ఉదయమే థోండోప్‌ను పిలిచి తమ నిర్ణయం గురించి తెలియచేశాడు సింగ్.

ఆ తరువాత ముగ్గురూ సౌత్ కోల్‌కు ప్రయాణమయ్యారు. ఎవరికివారు తమ లగేజ్‌ను వీపులపై బెల్టులతో బిగించుకున్నారు. ఒక్కొక్కరు ముప్పయి కిలోల బరువు మోయవలసి వచ్చింది. అప్పటికది ఎక్కువే. అయినా తప్పదు.

సరిగ్గా పదిరోజులకు సౌత్ కోల్ చేరుకున్నారు ముగ్గురూ సురక్షితంగా.

వెంటనే అక్కడ తేలికగా ఓ గుడారాన్ని నిర్మించుకున్నారు. ఆ తరువాత అంతా ప్రయాణ బడలికను తీర్చుకోవడానికి నిద్రపోయారు.

# 8

పరిశోధకులు ముగ్గురూ నిద్రలేచేటప్పటికి రాత్రి పన్నెండు గంటలయింది.

మంచుమనిషి జాడను అన్వేషించడానికి రాత్రి సమయమే అనువైనదని నిర్ణయించుకున్నారు.

వెంటనే కార్యాచరణకు పూనుకున్నారు.

జయాల్ బ్యూటేన్ వాయువుతో పనిచేసే స్టౌను వెలిగించి మంచును కరగబెట్టాడు. ఆ వచ్చిన నీటితోనే 'టీ' తయారుచేశాడు.

ముగ్గురూ కేన్డ్ ఫుడ్‌ను ఆరగించి వేడి టీ త్రాగారు.

ఆ తరువాత బయట వాతావరణానికి సరయిన దుస్తులు ధరించి, ఆయుధాలను రైఫిల్లో వుంచుకొని మంచుమనిషి అన్వేషణకై బయటకు బయలుదేరారు.

మంచు బాగా కురుస్తోంది. చలికి తట్టుకొనేవిధంగా దుస్తులు ధరించినా, వెన్నులోంచి వణుకు పుట్టుకవస్తోంది. బైనాక్యులర్స్ ధరించినా ఎక్కువదూరం కనబడటంలేదు.

ముగ్గురూ ఒకరికొకరు వేరుకాకుండా నైలాన్ రోప్ తో బిగించుకున్నారు. ఎంతదూరం తిరిగినా, దారితప్పకుండా వుండటానికి, గుడారం దగ్గరనుండి ప్రతి పదిఅడుగులకొక జండా పాతుకుంటూ అన్వేషణ ప్రారంభించారు.

ముందుగా ప్రొఫెసర్ దయాళ్ చెప్పిన ప్రకారం సౌత్ కోల్ కు ఉత్తరంగా అన్వేషణ ప్రారంభించారు.

తెల్లవారేవరకు వెదుకుతూనే వున్నారు. మంచుమనిషి జాడలు కన్పించలేదు.

ముగ్గురూ గూడారాన్ని చేరుకొని మళ్ళీ కొంచం ఆహారం తీసుకొని విశ్రమించారు.

సరిగ్గా మరుసటి రోజుకూడా రాత్రి పన్నెండు గంటలకు నిద్రలేచారు. ముగ్గురూ తృప్తిగా స్వీట్స్ తిని, టీ త్రాగి మళ్ళీ మంచుమనిషిని అన్వేషించడం కొరకు బయలుదేరారు.

ఈసారి సౌత్ కోల్ కు దక్షిణంగా అన్వేషణ మొదలు పెట్టారు.

దాదాపు వంద అడుగులు నడిచారు.

అంతలో వున్నట్లుండి చటుక్కున ఆగిపోయాడు జయాల్. అతనికళ్లు గాగుల్స్ లోనుండి మెరవసాగాయి.

మిగిలిన ఇద్దరూ జయాల్ వైపు చూశారు ప్రశ్నార్థకంగా.

జయాల్ తనకు రెండడుగుల దూరంలో వున్న దృశ్యాన్ని చూపించాడు.

జయాల్ నడిచే దారికి కొంచంప్రక్కగా మంచుపై పెద్ద పెద్ద పాదముద్రలు కన్పించాయి.

మంచుతో బాటు అవికూడా కరిగిపోవడానికి సిద్ధంగా వున్నాయి.

మంచుపై పాదముద్రలు ఎంతోసేపు వుండవు.

మంచుపై పాదముద్రలు యింకా నిలిచివున్న పరిస్థితిని బట్టి, మంచుమనిషి ఆ ప్రాంతంలో సంచరిస్తున్నాడని వూహించారు.

ముగ్గురిలోనూ ఉత్సాహం పరవళ్లు తొక్కింది. వేగంగా ఆ అడుగులను అనుసరించారు.

మరో యాభై అడుగులు నడిచారు. హఠాత్తుగా మంచుమనిషి పాదముద్రలు అదృశ్యమయ్యాయి.

చటుక్కున నిలబడిపోయారు ముగ్గురూ.

ముగ్గురి మనస్సులు తీవ్రంగా ఆలోచించసాగాయి.

'ఇక్కడవరకు వచ్చిన మంచుమనిషి ఏమయి

పోయాడు? తమరాకను పసిగట్టి ఎక్కడన్నా పొంచి వున్నాడా? తమను వెనకదెబ్బ తీయడుకదా!'

అందరి గుండెలూ ఒక్క సారి ఝల్లుమన్నాయి.

సింగ్ చేయి అప్రయత్నంగానే రివాల్వర్ మీదకు పోయింది.

అంతలో నరీందర్ హఠాత్తుగా అన్నాడు చిన్నగా.

"మిష్టర్ సింగ్, అదిగో, అటు పరీక్షగా చూడు. ఏదో మంచుగుహలావుంది!"

"మంచుకొండలపై గుహా?" ఆశ్చర్యంగా అడిగాడు జయాల్, నరీందర్ చూపించినవైపు చూస్తూ.

"నిజమే! బహుశా మంచుమనిషి తను నివశించడానికి అనువుగా ఓ గుహను నిర్మించుకున్నాడేమో?" గుహ వైపు చూస్తూ అన్నాడు సింగ్.

"ఆ గుహలోకి వెళదాం పదండి" ఉత్సాహంగా అన్నాడు నరీందర్.

"ఇప్పుడు వెళ్ళడం అంత క్షేమంకాదు. మంచుమనిషి ఆ గుహలో వున్నాడో, లేదో? అతను బయటేఎక్కడో తచ్చాడుతూ, మనం గుహలోకి ప్రవేశించగానే, గుహ ద్వారాన్ని మంచుతో కప్పేశాడంటే, మనం ఆమంచులో సజీవసమాధి కావలసిందే!" హెచ్చరించాడు బ్రిగేడియర్ సింగ్.

"అయితే, యిక్కడే పొంచివుందామంటారా? మంచు మనిషి గుహలోకి వెడుతున్నప్పుడో, గుహలోంచి వస్తున్నప్పుడో వల ఉపయోగించి బంధించవచ్చు" అన్నాడు జయాల్.

"ఆల్ రైట్! అదే మంచిపని. ఇక్కడే మంచుమనిషి కొరకు మాటువేద్దాం" అన్నాడు నరీందర్.

ముగ్గురూ మంచుమనిషి రాకకై నిరీక్షించసాగారు.

ఫ్లాస్క్ ఓపెన్ చేసి, కప్పులలో టీ పోసి, యిద్దరికీ యిచ్చి, తనో కప్పు అందుకున్నాడు జయాల్.

అరగంట గడిచింది. మంచుమనిషి వచ్చే జాడ లేమీ కన్పించలేదు. చుట్టూ మంచు కురుస్తున్నా నోరుమాత్రం తడారిపోతుంది.

"మిస్టర్ జయాల్ నిమ్మకాయలు తెచ్చావా?" అడిగాడు సింగ్.

"తెచ్చాను సర్" అంటూ కోటుజేబులోనుండి నిమ్మకాయలు తీసికొనిచ్చాడు.

తలా ఒక నిమ్మబద్ద నోట్లో వేసుకున్నారు.

మరోగంట గడిచింది. ఎస్. బి. ఎ. కాబట్టి నరీందర్ మాత్రం వినుగు చెందకుండా అలాగే నిలబడి వున్నాడు. మిగిలిన యిద్దరిలో మాత్రం వినుగు ప్రారంభమయింది.

"అసలు మనం యిలా నిరీక్షించడం వృధాయేమోనని నా అభిప్రాయం" అన్నాడు జయాల్.

"ఏం?" అడిగాడు నరీందర్.

"ఆ గుహ మంచుమనిషిదేనని నిర్ధారణ ఏమిటి? ప్రకృతి సిద్ధంగా మంచుపర్వతంపై కూడా గుహాలు వుండకూడదా? ధైర్యం చేద్దాం. ఆ గుహలోకి ప్రవేశించి చూద్దాం. ఏం జరిగితే అది జరిగింది."

ఎవరూ ఏమీ మాట్లాడలేదు.

"ఆల్ రైట్! ఇంతవరకు వచ్చిన తరువాత ప్రాణాలకు భయపడటంలో అర్థంలేదు. మీరు యిక్కడే ఉండండి. నేను లోపలకు వెళ్ళి చూసివస్తాను" ఉద్రేకంగా అన్నాడు జయాల్.

"మిస్టర్ జయాల్, ప్రాణాలకు భయపడి కాదు. మంచుమనిషి ప్లాన్ అర్థంగాక ఆగిపోయాము. ఆ గుహ దగ్గరకువచ్చి మంచుమనిషి పాదముద్రలు ఆగిపోయా

యుంటే ఆ గుహ మంచుమనిషి స్థావరమే అయివుంటుంది."

"మిస్టర్ నరేందర్, యిక మన నిరీక్షణ చాలు. పదండి మనముగ్గురం గుహలోకి వెళదాం. మంచుమనిషి ఒక్కడు. మనం ముగ్గురం. అదీగాక మనదగ్గర ఆయుధాలు వున్నాయి" ఉత్సాహంగా లేస్తూ అన్నాడు జైల్‌సింగ్.

ముగ్గురూ గుహవైపు నడిచారు.

అయిదు నిమిషాలలో గుహదగ్గరకు చేరుకున్నారు. గుహలోపలకు అడుగుపెట్టారు ముగ్గురూ, గుండెలరచేత బట్టుకొని.

చీకటిగావున్న ఆ గుహ అంతర్భాగం టార్చిలైట్ల కాంతిలో ఒక్కసారి ప్రకాశవంతమయింది.

గుహలోపల ఎవరూలేరు. విశాలమైన ఆ గుహ చాలా లోతుగా వున్నట్లుంది.

"పదండి. కొంచెం ముందుకువెళ్ళి అన్వేషిద్దాం" ముందుకు నడిచాడు సింగ్.

ఓ యిరవై అడుగులు ముందుకు నడిచారు.

హఠాత్తుగా ఆగిపోయాడు ముందు నడుస్తున్న సింగ్.

"స్టాప్ ప్లీజ్. అటు చూడండి" అయిదడుగుల దూరంలోవున్న ఓ ఆకారాన్ని చూపిస్తూ అన్నాడు సింగ్.

ఉత్సాహంగా అటువైపు చూశారు నరేందర్, జయాల్‌లు.

తెల్లటి మంచుపై పడుకొనివుందో ఆకారం. పదకొండడుగుల పొడవు, సన్నని మెడ, దట్టమైన వెంట్రుకలు, విశాలమైన ఛాతీ, అచ్చు ప్రొఫెసర్ చెప్పిన ఆకారం అదే!

"మంచుమనిషి" అప్రయత్నంగా పల్కారిద్దరూ.

"ఎస్ కరెక్ట్. ప్రొఫెసర్ దయాళ్ వర్ణించిన మంచు మనిషి యితనే! సందేహంలేదు" చిన్నగా అన్నాడు సింగ్.

"ఏం చేద్దాం?" అన్నట్టు చూశాడు జయాల్.

అంతలో మెల్లగా కదిలిందా ఆకారం.

చటుక్కున నరేందర్ తన చేతిలోని రివాల్వర్‌ను మంచుమనిషివైపు గురిపెట్టాడు.

"హాండ్సప్ మైడియర్ స్నోమాన్! కదిలావా కాల్చేస్తాను" గర్జించాడు నరేందర్.

చటుక్కున లేచి నిల్చున్నాడు మంచుమనిషి. తన చిన్నకళ్ళతో ఒక్కసారి ముగ్గురివైపు తీక్షణంగా చూశాడు.

అప్రయత్నంగానే ముగ్గురూ రెండడుగులు వెనక్కు వేశారు.

నరేందర్ చేతిలోని రివాల్వర్ గురిమాత్రం మారలేదు.

మంచుమనిషి భారీశరీరాన్ని ఆశ్చర్యంగా చూస్తూ, జరిగిన యీ హఠాత్సంఘటన ఏ పరిణామానికి దారి తీస్తోందోనని ఆందోళన చెందసాగారు సింగ్, జయాల్‌లు.

ఓ రెండు క్షణాలు గడిచాయి. హఠాత్తుగా మంచు మనిషి బలంగా కాలు విదిలించాడు. విసురుగా గాలిలోకి లేచిన ఓ మంచుముద్ద వేగంగా వచ్చి బలంగా ముగ్గుర్నీ తాకింది.

నరేందర్ చేతిలోని రివాల్వర్ ఎగిరి దూరంగా పడింది.

మంచుముద్ద తాకిడికి ముగ్గురూ క్రిందపడ్డారు.

ఊహించని యీ ప్రతిఘటనకు అదిరిపడి, తేరుకొని లేచారు ముగ్గురూ.

చటుక్కున రివాల్వర్ అందుకొని ముందుకు దూకబోయి ఆగిపోయాడు సింగ్.

ఎదురుగా మంచుమనిషి లేడు.

గబగబ ముందుకు పరిగెత్తబోయాడు సింగ్. అతన్ని బలంగా పట్టుకొని ఆపాడు జయాల్.

"సింగ్ జీ, ఉద్రేకపడకండి. మనం ముందుకు వెళ్ళడం చాలా అపాయం. ఈ గుహ ఎంత పొడవుందో వూహించలేము. మంచుమనిషి ఏ చాటునన్నా మాటేసి, మనల్ని కాటేయవచ్చు. ఇక మనం తిరిగి వెళ్ళిపోదాం. రేపు పగలు యీ గుహ లోతుపాతులు తెలుసుకొని, రాత్రికి ఇదే సమయంలో మరింత జాగ్రత్తలో మంచుమనిషిని ఎదుర్కొందాం" చెప్పాడు జయాల్.

నరీందర్ కూడా జయాల్ ను బలపర్చాడు.

ముగ్గురూ తమ టెంట్ వైపు నడక సాగించారు.

గుడారం సమీపానికి చేరుకున్న ముగ్గురూ, అక్కడి దృశ్యాన్ని చూసి ఆశ్చర్యచకితులై పోయారు.

గుడారం చుట్టూ మంచుమనిషి తిరుగుతున్నాడు. గుడారం మొత్తాన్ని కూల్చివేద్దామని ప్రయత్నిస్తున్నాడు. గుడారం ద్వారంగుండా లోపలకు తొంగి చూసిన మంచుమనిషి ఉలిక్కిపడి భయం భయంగా ముందుకు నడుస్తూ మంచులో కలిసిపోయాడు.

పరిశోధకుల ముగ్గురికీ ఏమీ అర్థంకాలేదు.

'మంచుమనిషి ఎందుకు వచ్చినట్లు? తమ గుడారాన్ని నాశనం చేయడానికా? నాశనం చేయడానికి వచ్చి, గుడారంలోకి తొంగిచూసి భయపడుతూ ఎందుకు పారిపోయినట్లు?'

ముగ్గురూ గుడారంలోకి నడిచారు.

"మంచుమనిషి ఎందుకు పారిపోయాడో ఇప్పుడర్థమయింది" వుత్సాహంగా అరిచాడు సింగ్.

ఆశ్చర్యంగా చూశారు జయాల్, నరీందర్ లు.

"మిస్టర్ జయాల్, ఇంతకుముందు నువ్వు వెలిగించిన స్టౌను ఆర్పేయడం మర్చిపోయావు. అదే ఇప్పుడు మన గుడారాన్ని కాపాడింది. ఆ స్టౌ లోని మంటను చూసే, మంచుమనిషి బెదిరి పారిపోయాడు."

"ఈజిట్?" ఆశ్చర్యంగా అడిగాడు నరిందర్.

"ఇటీజ్ కరెక్ట్! మంచుమనిషి బలహీనత అర్థమై పోయింది. అతనికి అగ్నిని చూసినా, టార్చి వెలుగులని చూసినా భయం. ఇక మంచుమనిషిని బంధించడం చాలా తేలిక. మీకు నా ప్లాన్ రేపు చెబుతాను. ఈ రోజుకు రెస్ట్ తీసుకుందాం" అన్నాడు జైల్‌సింగ్ వుత్సాహంగా.

అంతా స్లీపింగ్ బ్యాగ్స్‌లలో దూరారు.

# 9

మరుసటి రోజు రాత్రి సరిగ్గా పన్నెండు గంటలకు మంచుమనిషి కొరకు మళ్ళీ బయలుదేరారు ముగ్గురూ.

గుహ ముఖద్వారం వద్దకు చేరుకున్నారు.

పెద్ద ఇనుప వలను జయాల్ కిస్తూ చెప్పాడు సింగ్.

"మిస్టర్ జయాల్, యీ గుహ యాభై అడుగుల పొడవుంది. సరిగ్గా అటువైపుకూడా గుహకు ద్వారం వుంది. నువ్వు యీ గుహను చుట్టివెళ్ళి అటువైపు గుహ ద్వారానికి యీ వలను వ్రేలాడదీయి. మేం ఇటువైపు నుండి గుహలో ప్రవేశించి, మంచుమనిషిని భయపెట్టి తరుముతాం. అతను అటువైపునుండి పారిపోబోయి, ఆ కంగారులో మన వలలో తప్పక చిక్కుతాడు."

"ఓ. కె. సర్" అన్నాడు వుత్సాహంగా జయాల్.

"గో అన్. వెంటనే నువ్వు బయలుదేరు. సరిగ్గా మరో రెండు గంటలకు మేం ఇటునుండి గుహలోకి ప్రవేశిస్తాం. అప్పటికి నువ్వు వల బిగించుకోవడం పూర్తి అవుతుంది" చెప్పాడు సింగ్.

"గుడ్ లక్" చెప్పి వలతో ముందుకు నడిచాడు జయాల్.

"రెండు గంటలయింది జయాల్ వెళ్ళి" అన్నాడు నరేందర్ తన వాచీ చూసుకుంటూ.

"ఇక మనం గుహలోకి ప్రవేశిద్దాం" బ్యూటేన్ వాయువుతో పనిచేసే స్టౌ వెలిగిస్తూ అన్నాడు సింగ్.

రెండు నిమిషాలలో స్టౌ వెలిగింది. సింగ్ స్టౌ అందుకొని ముందు నడవ సాగాడు. నరేందర్ రివాల్వర్‌ను పొజిషన్‌లో వుంచుకొని, టార్చిలైట్ చేతబట్టుకొని సింగ్‌ను అనుసరించాడు.

ఇద్దరూ గుహలో ప్రవేశించారు.

దాదాపు పాతిక అడుగులు నడిచారు. అంతలో ఎదురుగావున్న దృశ్యం చూసి చటుక్కున ఆగిపోయారిద్దరూ.

తెల్లగావున్న మంచుపై పడుకొనివున్న మంచుమనిషి కన్పించాడు. సరిగ్గా అంతకుముందు పడుకొనివున్న చోటే, పడుకొని వున్నాడు మంచుమనిషి.

కాలితో గట్టిగా శబ్దం చేశాడు నరేందర్.

ఉలిక్కిపడి లేచాడు మంచుమనిషి. కోపారుణిత నేత్రాలతో ఓసారి ఇద్దరివైపు తీక్షణంగా చూశాడు.

సింగ్ పట్టుకొనివున్న వెలుగుతున్న స్టౌ అతనికంట పడింది. అంతలోనే నరేందర్ చేతిలోని టార్చిలైట్ ఫోకస్ అతనిమీద పడింది. అంతే! వులిక్కిపడి వెనక్కి తిరిగి పరిగెత్తసాగాడు.

స్టౌ, టార్చిలైట్లు అలాగే పట్టుకొని, మంచుమనిషిని మరింత భయపెడుతూ, అతని వెంట పరుగెత్తసాగారు సింగ్, నరేందర్‌లు.

అంతలో కెవ్వున ఓ కేక వినబడింది. సరిగ్గా మనిషి అరిచిన అరుపు.

"మై గాడ్! ఎవరిదా అరుపు? జయాల్ ది కాదుగదా? మంచుమనిషి వలలో చిక్కాడో, లేదో? లేకపోతే జయాల్ ను దెబ్బతీసి తప్పించుకు పారిపోయాడా?" భయపడుతూ గబగబ ముందుకు నడిచారు సింగ్, నరీందర్ లు.

పదిహేను నిమిషాలలో అవతలవైపు గుహద్వారాన్ని చేరుకున్నారు.

ఎదురుగా కనబడిన దృశ్యం వారిద్దరినీ ఆనందంలో ముంచివేసింది.

మంచుమనిషి వలలో చిక్కుకొని గిలగిల తన్నుకుంటున్నాడు. మంచుమనిషి కెదురుగా జయాల్ రివాల్వర్ పుచ్చుకొని నిలబడి వున్నాడు.

మంచుమనిషి పెద్దగా ఏదో అరుస్తున్నాడు. ఏదేదో మాట్లాడుతున్నాడు. వికృతంగా పెడబొబ్బలు పెడుతున్నాడు.

అతని అరుపులను ఆలకించిన జైల్ సింగ్ ఓ క్షణం ఆశ్చర్యచకితుడయ్యాడు.

"మిష్టర్ నరీందర్, మంచుమనిషి మాట్లాడుతున్నాడు" అన్నాడు సింగ్.

ఆశ్చర్యపోయాడు నరీందర్. "వాట్. మంచుమనిషి మాట్లాడుతున్నాడా? నాకేమీ అర్థం కావడంలేదు."

చిన్నగా నవ్వాడు సింగ్.

"అవును మిష్టర్ నరీందర్, మంచుమనిషి నిజంగానే మాట్లాడుతున్నాడు. అతను సంస్కృత భాషలో మాట్లాడుతున్నాడు."

"మీకు సంస్కృతం వచ్చా?"

"ఆఁ." అప్పటివరకు వారి సంభాషణను కుతూహలంగా వింటున్న జయాల్ అడిగాడు ఆత్రంగా.

"మంచుమనిషి ఏం మాట్లాడుతున్నాడు సర్?"

"నన్ను వదలండి. నేను మిమ్మల్నేం చేయను. నన్ను వదలండి! అంటున్నాడు మంచుమనిషి" చెప్పాడు సింగ్.

"థాంక్ గాడ్! మీకు సంస్కృతం రావడం నిజంగా మా అదృష్టం," అన్నాడు జయాల్ సంతోషంగా.

"అయితే మంచుమనిషి మనం వూహించినట్లు, శత్రువుల రాడార్ యంత్రం కాదా?" కొంచెం దిగులుగానే అన్నాడు నరీందర్.

"అన్ని విషయాలు మంచుమనిషితోనే మాట్లాడి తేల్చుకుందాం. పదండి" ఉత్సాహంగా మంచుమనిషి దగ్గరకు నడిచాడు సింగ్.

# 10

"ఎందుకలా మమ్మల్ని చూసి భయపడతావ్?" సంస్కృతంలో అడిగాడు సింగ్, మంచుమనిషిని.

మంచుమనిషి ఆశ్చర్యంగా సింగ్ వైపు చూశాడు. అతని కళ్ళు తళతళ మెరిశాయి.

"నాకు మనుషులంటే భయం, కోపం, అసహ్యం. దయచేసి నన్ను వదలండి. నామానాన నేను వెళ్ళిపోతాను. మిమ్మల్నేం చేయను" ప్రాధేయపడ్డాడు మంచుమనిషి.

"నువ్వూ మనిషిలాగానే వున్నావుగా. మరి నీ కెందుకని మనుషులంటే భయం?"

పెద్దగా నవ్వాడు మంచుమనిషి. మంచు దిమ్మలు జారుతున్నప్పుడు వచ్చే ధ్వనిలావుంది అతని నవ్వు.

"నేను ఒకప్పుడు మనిషినే. కానీ ఇప్పుడు మంచు మనిషిని. కొందరు మనుషులు చేసిన ద్రోహంవలన నేను

మంచుమనిషిగా మారిపోవలసి వచ్చింది."

"నీ చరిత్ర చాలా కుతూహలంగా వుంది. దయచేసి నీ గత చరిత్రంతా మాకు చెబితే, మేం చేయతగిన సహాయం చేస్తాం."

"ముందు నన్ను వలనుండి బయటకు తప్పించండి. స్వేచ్ఛా జీవితానికి అలవాటుపడిన నేను, యీ బంధ నాలను సహించలేను."

"నిన్ను వదలగానే, నువ్వు పారిపోతే...?"

"లేదు. నేను పారిపోను. ఇంతవరకు నా చరిత్ర మరొకరికి చెప్పవలసి వస్తుందని వూహించలేదు. ఇప్పుడా అవకాశం వచ్చింది. భగవంతునిపై ప్రమాణంచేసి చెబుతున్నాను. నేను పారిపోను."

"మిష్టర్ జయాల్, మంచుమనిషిని వలనుండి తప్పించు" జయాల్ వైపు తిరిగి చెప్పాడు సింగ్.

జయాల్ ఆందోళనగా చూశాడు సింగ్ వైపు.

చిన్నగా నవ్వాడు సింగ్. "మరేం భయంలేదు జయాల్. మంచుమనిషి మనకిప్పుడు మిత్రుడు. వదిలి పెట్టు."

జయాల్ మంచుమనిషిపై బిగించుకున్న వలను వదిలించాడు.

ఒక్కసారి ఒళ్లు దులుపుకుంటూ లేచి నిల్చుని సింగ్ వైపు కృతజ్ఞతా పూర్వకంగా చూశాడు మంచుమనిషి.

"మంచుమనిషీ, నీ గత చరిత్ర చెప్పి, నీమీద మాకున్న దురభిప్రాయాన్ని తొలగిస్తావా?" అడిగాడు సింగ్.

"దురభిప్రాయమా?" ఆశ్చర్యపోయాడు మంచుమనిషి.

"అవును. ఇంతకుముందు ఎవరెస్ట్ నధిరోహించిన ప్రొఫెసర్ దయాళ్ బృందానికి నువ్వు కనబడ్డానట!

హారు మాకు చెప్పారు. మేము నువ్వు ఏ శతృదేశానికో చెందిన రాడార్ యంత్రమయి వుంటావని వూహించి, నిన్ను నాశనం చేయడానికి వచ్చాం. బంధించాం. నాకు సంస్కృతం రాకపోతే, నిన్ను ఏం చేసే వాళ్ళమో?'' చెప్పాడు సింగ్.

చిన్నగా నవ్వాడు మంచుమనిషి.

''అయితే నా చరిత్ర మీకు చెప్పడం చాలా అవసరం. అన్నట్లు ఇది ఏ సంవత్సరం?'' అడిగాడు.

''1973'' చెప్పాడు సింగ్.

ఓ రెండు నిమిషాలాగి, చిన్నగా కళ్ళు మూసుకొని చెప్పసాగాడు మంచుమనిషి:

''నేను లింబూ తెగకు చెందినవాడ్ని. నా పేరు బుడుంగా. నేను ఇప్పుడు మీకు చెప్పే విషయాలు మిక్కిలి ఆశ్చర్యాన్ని కలిగించవచ్చు. కానీ అవి యదార్థ విషయాలు, నగ్న సత్యాలు.

నేను సంస్కృతంలోనే గాక, వైద్యంలోగూడా పండితుడ్ని. ఎప్పుడూ వైద్యంలో కొత్తకొత్త మూలికలను సంయోగంచేసి సరికొత్త మందులను కనిపెట్టే వాడిని. మంచు పర్వతాలలో 'సంజీవి' వుందని, ఆ సంజీవి ద్వారా మానవుడు అయిదువందల సంవత్సరాలు తన ఆయుః ప్రమాణాన్ని పెంచుకోవచ్చని, వైద్యపితామహుడు ధన్వంతరి వ్రాసిన ఓ తాళపత్రం నాకు లభించింది. ఆ తాళపత్రం చూసి నేనెంతో సంతోషించాను. వెంటనే ఆ సంజీవిని సాధించడం కొరకు, మరో ఇద్దరు వైద్యులతో 1673వ సంవత్సరంలో, అంటే సరిగ్గా మూడు వందల సంవత్సరాల క్రితం మంచుపర్వతాల పైకి బయలు దేరాం.

దాదాపు ఓ సంవత్సరంపాటు మా అన్వేషణ

సాగించాం.

చిట్టచివరకు ఇదే ప్రాంతంలో మా అన్వేషణ ఫలించింది. ప్రపంచంలో ఎవరూ చూడని, చూడలేని సంజీవి నా కంటపడింది. మిత్రులిద్దరికీ సంజీవిని చూపించాను వుత్సాహంగా. శుభ ఘడియలలో మంత్రోచ్చారణ మధ్య ఆ సంజీవి త్రవ్వితీద్దామని నిశ్చయించుకొని, మా గుడారంలో వచ్చి పడుకున్నాం.

ఆదేసమయంలో నేను నిద్రబోయాననుకొని, నా మిత్రులిద్దరూ, నన్ను వంచించి సంజీవిని అపహరించడానికి ప్రణాళిక వేసుకున్నారు. నా మిత్రుల వుద్దేశ్యం బయటపడగానే, వారంటే నాకు చాలా అసహ్యం వేసింది. వారిని తిరిగి వంచించాలని నిశ్చయించుకొని, వారిద్దరూ నిద్రపోయేవరకు మెలుకువగా వుండి, అర్ధరాత్రి ఒక్కడినే సంజీవి దగ్గరకు వెళ్ళి, ఆ సంజీవిని స్వంతం చేసుకున్నాను. ఆ క్షణమే సంజీవిని స్వీకరించి, ఏమీ తెలియనట్లు గుడారంలోకి వచ్చి పడుకొని తృప్తిగా నిద్ర బోయాను.

ఆ రోజు రాత్రి, నా మిత్రులిద్దరూ, వారి ప్రణాళికను మార్చుకున్నారో, ఏమో, నిద్రలోవున్న నన్ను ఇద్దరూ మోసుకువెళ్ళి ఓ పెద్ద మంచు అగాధంలోకి విసిరేశారు. ఆ దెబ్బకు నేను అగాధంలోపడి ప్రాణాలు కోల్పోవలసిందే, కానీ సంజీవిని స్వీకరించడం వలన ప్రాణాలు నిలిచాయి.

ఆ అగాధంనుండి పైకి రావడానికి ఎంతో ప్రయత్నించాను. కానీ నాకు సాధ్యపడలేదు. ఆ విపత్కర పరిస్థితులలో నన్ను రక్షించే నాధుడెవ్వరు? ప్రాణాలు మాత్రం వున్నాయి. మరి ఆహారం ఏది? నాకు తోడు, నీడ అన్నీ ఆ మంచు అగాధమే! ఆకలయినప్పుడు మంచు

తినేవాడిని. దాహంవేసినప్పుడు ఎండకు కరిగిన మంచు నీరు త్రాగేవాడిని.

దాదాపు కాలగర్భంలో ఓ వంద సంవత్సరాలు గడిచి పోయి వుంటాయి. ఎప్పుడూ మంచులోనే వుంటూ, మంచునే తింటూ వుండటంవలన నా శరీరంలో విపరీత మయిన మార్పులు సంభవించాయి. శరీరమంతా విపరీతంగా పెరిగిపోయింది. అంతా మంచు కప్పు ఏర్పడిపోయింది. ఓ చిన్న మంచు పర్వతంలా తయారయ్యాను. నా ఆకారంలో యీ మార్పులు సంభవించిన తరువాత, ఆ అగాధంలో నుండి బయటకు రావడం పెద్ద కష్టమనిపించలేదు. కానీ యీ ఆకారంతో ఆ ప్రపంచంలోకి అడుగు పెట్టడానికి, వంచితులయిన మనుష్యులమధ్య బ్రతకడానికి నా మనసొప్పలేదు. నాపై నాకే అసహ్యం వేసింది. చావాలని ప్రయత్నించాను. కానీ సంజీవి స్వీకరించిన నాకు చావు ఎలా వస్తుంది? ఆ రకంగా యీ మంచుకు అలవాటుపడి మంచుమనిషిగా తయారయిపోయాను.

ఇటీవల ఓ యాభై సంవత్సరాలనుండి అప్పుడప్పుడు మనుషులను యీ పర్వతాలపై చూడసాగాను. కానీ నాకు మనుషులంటే విపరీతమయిన భయం, అసహ్యం ఏర్పడిపోయింది. సాధారణంగా ఎవరయినా యీ పర్వతాలను ఎక్కినప్పుడు వారికి కన్పించకుండా తప్పించుకొనే వాడిని. అయితే ఇటీవల కొందరు మనుషులు నన్ను చూశారు'' చెప్పడం ముగించాడు మంచుమనిషి.

మంచుమనిషి చరిత్ర విని ఆశ్చర్యపోయాడు సింగ్. అతని కళ్లు అశ్రుపూరితాలయ్యాయి.

''మంచుమనిషీ, నువ్వు మళ్ళీ మా వెంట మనదేశానికి రాకూడదూ? నిన్నొక అపురూప వ్యక్తిగా భావించి నిన్ను మేం కాపాడుకొంటాం.''

చిన్నగా నవ్వాడు మంచుమనిషి.

"మీ అభిమానానికి కృతజ్ఞతలు. నేను మీ వెంట రాలేను. ఈ మంచుకు నేను అలవాటు పడిపోయాను. ఎందుకో మళ్ళీ మనుషులమధ్య మసలాలనిలేదు. నా శేష జీవితం యీ మంచు పర్వతాలమీదే గడిపేస్తాను. క్షమించండి" చెప్పాడు వినయంగా.

ఆశ్చర్యంగా తమ సంభాషణను వింటున్న జయాల్, నరీందర్‌లకు తమ సంభాషణనంతా హిందీలో వివరించి చెప్పాడు సింగ్.

అంతా ఆశ్చర్యంగా మంచుమనిషివైపు చూశారు.

"మంచుమనిషీ నీ చరిత్ర అమోఘం. నువ్వు ధన్యజీవివి. నీ చరిత్రను ప్రపంచానికి వెల్లడిచేసే మేం కూడా చరితార్థులం. నిన్ను అపార్థం చేసుకున్నందులకు మమ్మల్ని మనసారా క్షమించు" మంచుమనిషివైపు చూస్తూ అన్నారిద్దరూ.

ప్రశ్నార్థకంగా సింగ్ వైపు చూశాడు మంచుమనిషి.

సింగ్ అతనికి సంస్కృతంలో ట్రాన్స్‌లేట్ చేసి చెప్పాడు.

కృతజ్ఞతగా అందరికీ తలవంచి నమస్కరించాడు మంచుమనిషి.

"నేను మీ మంచిని, మనదేశ క్షేమాన్ని కోరేవాడిని. నన్ను అపార్థం చేసుకోకండి. మీకు శుభం కలుగుగాక. ఇక శెలవ్" అంటూ మరోసారి అందరికీ నమస్కరించి వెనుదిరిగి వెళ్ళిపోయాడు మంచుమనిషి.

దూరంగా మంచులో కలిసిపోతున్న మంచుమనిషి ఆకారాన్ని చూస్తూ, దీర్ఘంగా నిట్టూర్చారు ముగ్గురు పరిశోధకులూ.

—: ఐపోయింది :—